మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 9-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 249 Issue: 249

09 మార్చి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:32 సూర్యాస్తమయం - సా. 6:21 తిథి షష్ఠి రా. 11:29 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం విశాఖ సా. 4:06 వరకు తరువాత అనురాధ యోగం వృషుతా ఉ. 7:31 వరకు కరణం గరజి ఉ. 10:18 వరకు వనిజ రా. 11:29 వరకు వర్జ్యం రా. 8:40 నుండి రా. 10:28 వరకు దుర్ముహూర్తం మ. 12:50 నుండి మ. 1:37 వరకు మ. 3:11 నుండి మ. 3:59 వరకు రాహుకాలం ఉ. 8:01 నుండి ఉ. 9:29 వరకు యమగండం ఉ. 10:58 నుండి మ. 12:26 వరకు గుళికాకాలం మ. 1:55 నుండి మ. 3:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:56 నుండి తె. 5:44 వరకు అమృత ఘడియలు ఉ. 6:23 నుండి ఉ. 8:10 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:03 నుండి మ. 12:50 వరకు

Published from Jagitial
Circulated to Telangana


**2007: ధోనీ కెప్టెన్సీలో..**



**2024: రోహిత్ శర్మ కెప్టెన్సీలో..**




**2026: సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలో..**



# ధనాధన్.. తీన్ ధమాకా

## పొట్టి కప్ విజేతగా టీమిండియా

ముచ్చటగా మూడోసారి కప్ గెలుపు.. ట్రోఫీ నిలబెట్టుకున్న టీమిండియా

సూర్య సేన ఆల్ రౌండ్ ప్రతిభ.. ఫైనల్‌లో కివీస్‌పై భారీ విజయం

రాణించిన అభిషేక్, సంజూ, ఇషాన్, బుమ్రా, అక్షర్

అభిషేక్ ఒక సిక్స్.. సంజూ ఒక సిక్స్.. అభిషేక్ ఒక ఫోర్.. సంజూ ఒక ఫోర్.. అభిషేక్ రెండు సిక్సులు.. సంజూ రెండు సిక్సులు.. మీరేనా? నేనేం తక్కువా అని ఇ'షాన్'దార్ బ్యాటింగ్.. నా విలువేంటో చూపిస్తానని శివాలెత్తిన శివం దుబే.. అక్షర్ పటేల్ వికెట్ల వేట.. బుమ్రా బూమ్ బూమ్ బౌలింగ్.. పవర్ హౌజ్ ఫీల్డింగ్.. ఇలా అన్ని రంగాల్లో పైచేయి సాధించి కప్పు చేతబట్టింది.. డిఫెండింగ్ చాంపియన్. మువ్వన్నెల జెండా మెరిసేలా, యావత్ భారతావని మురిసేలా.. అభిమాన లోకం గర్వించేలా.. వరుసగా రెండో కప్‌ను కైవసం చేసుకుంది టీమిండియా.





టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది.

.. 'క్రీడావాణి' పేజీలో..



**బంగారం-వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,364 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,340 |

# రేవంత్ రెడ్డి ఫోనెత్తడేం!

## 200 సార్లు కాల్ చేసిన అపాయింట్‌మెంటూ ఇస్తలే

### మోత్కుపల్లి తీవ్ర ఆరోపణలు



హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తాజా ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి.. ప్రాణాలు కోల్పోయిన వారికి అండగా ఉండాలని కోరేందుకు తాను ప్రయత్నిస్తున్నప్పటికీ.. రేవంత్ రెడ్డి ఫోన్ ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం తాను 200 సార్లు ఆయనకు ఫోన్ చేసినట్లు మోత్కుపల్లి నర్సింహులు తెలిపారు. తనకు కనీసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని.. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో కేబినెట్ మంత్రిగా చేసినట్లు గుర్తు చేసుకున్న మోత్కుపల్లి నర్సింహులు.. తన జాతి ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్దామంటే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. దశాబ్దాలుగా సాగిన ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి.. ఆ తరువాయి 2 వ పేజీలో...

# విద్యార్థినులకు స్కూటీలు

## రేవంత్ మహిళా దినోత్సవ కానుక

డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100% ఎలక్ట్రిక్ బస్సులు

డీజిల్ బస్సులు జిల్లాలకు తరలింపు


ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థినులకు తీపి కబురు అందించారు. చదువుకునే ఆడబిడ్డల ప్రయాణ కష్టాలను తీర్చడంతో పాటు, వారిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తరపున ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.




హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు: ప్రజాభవన్‌లో ఘనంగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం.. మహిళా సాధికారతకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు... త్వరలోనే ఈ ఉచిత స్కూటీల పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, డ్వాక్రా తరువాయి 2 వ పేజీలో...

**విశ్వవాణి**



దంతాలను పునఃసృష్టించే సరికొత్త ఔషధాన్ని జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం దంతాలు ఊడిపోతే ఇంప్లాంట్లతో కానిచేస్తున్నారు. తాజాగా మానవులపై నిర్వహిస్తున్న పరిశోధనలు విజయవంతం అయితే మానవ నిర్మాణ చరిత్రలో అద్భుతం అవుతుంది.

# నిప్పుల వాన

## 40 డిగ్రీలు దాటిన ఎండలు

ఉదయం 8 గంటలకే భగభగ... జాగ్రత్తలు తప్పనిసరి: వాతావరణశాఖ

తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మార్చి మట్నదటి వారంలోనే నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. భానుడి భగభగలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. పది తర్వాత రోడ్లపైకి రావాలంటేనే భయపడే స్థితి ఏర్పడింది.



హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సహా చాలా జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా నమోదైంది. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ముఖ్యంగా ఖమ్మం, మహబూబ్‌నగర్, తరువాయి 2 వ పేజీలో...




# బయటికి రావొద్దు

## ఇరాన్ ప్రజలకు అమెరికా హెచ్చరిక

జనావాసాల నుంచే ఇరాన్ సైన్యం క్షిపణుల ప్రయోగం

స్వదేశానికి చేరిన 32 వేల మంది అమెరికన్లు

వాషింగ్టన్: ఇరాన్ పౌరులకు అమెరికా సైన్యం ఆదివారం కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ సైన్యం జనావాసాల మధ్య నుంచే డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తున్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. ఈ వ్యూహం వల్ల లక్షలాది తరువాయి 2 వ పేజీలో...



# భారత్ ముఖ్యం

అందుకే రష్యా ఆయిల్‌పై ఆంక్షల సడలింపు

ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై ఒత్తిడి తగ్గించేందుకే

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: 'భారత్ మాకు ముఖ్యమైన భాగస్వామి... అందుకే రష్యా ఆయిల్ కొనుగోలు విషయంలో 30 రోజుల పాటు వెసులుబాటు కల్పించాం" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. పశ్చిమ -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

9.3.2026

మేషం: సమాజంలో పెద్దల అనుగ్రహంతో కీలకమైన పనులు పూర్తిచేస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

వృషభం: ప్రయాణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి, వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు మానసికంగా కొంత చికాకు కలిగిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. కీలక విషయాలలో అలోచించి ముందుకు సాగాలి.

మిధునం: మాతృ వర్గ బంధు మిత్రులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారములలో నష్ట సూచనలున్నవి. అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు.

కర్కాటకం: బంధు, మిత్రులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగు పడుతుంది. వృత్తి ఉద్యోగమున పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు. చేపట్టిన పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగములలో బాధ్యతలు నిర్వహించడంలో లోటుపాట్లు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. నేత్ర సంభంధిత సమస్యలు కలుగుతాయి.

కన్య: నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశములు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు నూతన పెట్టుబడులు లభిస్తాయి. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. మొండి బాకీలు ఋణాలు తీర్చగలుగుతారు.

తుల: ఇంటాబయట సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. కీలక వ్యవహారాలలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు నిరాశ కలిగిస్తాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. వృత్తి ఉద్యోగాలలో పై అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

వృశ్చికం: కొన్ని పనులు అనుకూలంగా పూర్తి చేస్తారు. ఆర్థికంగా వ్యవహారాలు సంతృప్తి కలిగిస్తాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: దైవ సేవా కార్యక్రమాలు నిర్వహించి పెద్దల నుండి ప్రశంసలు అందుకుంటారు. మొండి బాకీలు వసూలు అవుతాయి. వృత్తి, ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. గృహమున సంతాన వివాహ విషయమై చర్చలు జరుగుతాయి. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు మరింత నిరాశ కలిగిస్తాయి. ఇతరులతో అలోచించి మాట్లాడటం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పని భారం ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు.

కుంభం: దూర ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కలిసిరావు. బంధు మిత్రుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక సమస్యలు కలుగుతాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి.

మీనం: చాలాకాలంగా వేధిస్తున్న స్థిరాస్తి వివాదాల నుండి బయట పడతారు. ఆర్థిక విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపార విషయమై పెద్దల సలహాలు తీసుకోవడం మంచిది. విద్యార్థులకు నూతన అవకాశములు లభిస్తాయి. పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు.




# తొలి రింగ్ మెట్రో

## ఢిల్లీలో ప్రారంభించిన ప్రదాని మోదీ.. ఢిల్లీకి వరాల జల్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం 12.3 కిలోమీటర్ల పొడవైన మజ్లిస్ పార్క్–మౌజ్‌పూర్–బాబర్‌పూర్ పింక్ లైన్ సెక్షన్‌ను, 9.9 కిలోమీటర్ల పొడవైన దీపాలి చౌక్–మజ్లిస్ పార్క్ ఎక్స్‌టెన్షన్ మెజెంటా లైన్‌ను ప్రారంభించారు. ఢిల్లీ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 5 (ఏ) కింద మూడు కొత్త కారిడార్‌లకు ప్రధాని శంకుస్థాపన చేశారు. పింక్ లైన్ కొత్త విభాగం కారిడార్ వృత్తాకార లైన్‌ను పూర్తి చేస్తుంది. ఇది దేశంలో మొట్టమొదటి ఆపరేషనల్ రింగ్ మెట్రో నెట్‌వర్క్‌గా మారుతుంది. మజ్లిస్ పార్క్–మౌజ్‌పూర్–బాబర్‌పూర్ విభాగంలో తొమ్మిది స్టేషన్లు ఉన్నాయి. అన్నీ ఎలివేట్ కారిడార్లను నిర్మించారు. ఉత్తర – ఈశాన్య ఢిల్లీ మధ్య కనెక్టివిటీని బలోపేతం చేయాలని భావిస్తున్నారు. ఈ స్టేషన్లు మజ్లిస్ పార్క్, బురారీ, జగత్‌పూర్–వజీరాబాద్, సూర్‌ఘాట్, సోనియా విహార్, ఖజురీ ఖాస్, భజన్‌పురా, యమునా విహార్, మౌజ్‌పూర్–బాబర్‌పూర్ గుండా ఈ లైన్ సాగనుంది. కొత్త పింక్ లైన్ కారిడార్‌లో ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కూడా ఉన్నాయి. యమునా నదిపై కొత్త వంతెన, మెట్రో లైన్, రోడ్ ఫ్లైఓవర్ రెండింటినీ మోసే డబుల్ డెక్కర్ వయాడక్ట్. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెజెంటా లైన్ ఎలివేటెడ్ ఎక్స్‌టెన్షన్ అయిన దీపాలి చౌక్–మజ్లిస్ పార్క్ కారిడార్‌ను కూడా ప్రారంభించారు. ఇది మధుబన్ చౌక్, నార్త్ పితంపురా–ప్రశాంత్ విహార్, హైదర్‌పూర్ బద్లి మోర్, భల్స్వా వంటి ప్రాంతాలను కలుపుతుంది. ఈ విభాగంలో మొత్తం ఏడు స్టేషన్లు ఉంటాయి.మెజెంటా లైన్ కారిడార్‌లోని కొన్ని విభాగాలు దాదాపు 28.36 మీటర్ల ఎత్తుకు చేరుకుంటాయి. ఇది ఢిల్లీ మెట్రో నెట్‌వర్క్‌లోని అత్యంత ఎత్తైన విభాగాలలో ఒకటిగా నిలిచింది. ఈ అదనంగా లైన్ మొత్తం పొడవును సుమారు 49 కిలోమీటర్లకు తీసుకువస్తుంది. ప్రస్తుతం, కారిడార్‌లోని బొటానికల్ గార్డెన్–కృష్ణ పార్క్ ఎక్స్‌టెన్షన్ విభాగం పనిచేస్తోంది. ఈ సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పనితీరును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. "నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ముఖ్యమంత్రి రేఖ గుప్తా విజయవంతమైన నాయకత్వంలో, రాజధాని అభివృద్ధిని చవిచూస్తోంది. రాజకీయాలు, పరిపాలన, సైన్స్, క్రీడలు లేదా సామాజిక సేవలో ఏదైనా, భారతదేశ మహిళా శక్తి ప్రతి రంగంలోనూ నూతన శక్తితో ముందుకు సాగుతోంది. ఈరోజు మహిళా దినోత్సవం సందర్భంగా దేశంలోని మహిళలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. దేశాభివృద్ధికి వారు చేసిన అపారమైన కృషికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని మోదీ అన్నారు.

## రేవంత్ రెడ్డిఫోనెత్తడేం!

మొదటి పేజీ తరువాయి

పోరాటంలో అమరులైన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరేందుకు తాను ప్రయత్నిస్తే అపాయింట్‌మెంట్ దొరకడం లేదని లేదని తెలిపారు. తమకు 5 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తే మాదిగ భవనం నిర్మించుకుంటామని మోత్కుపల్లి వెల్లడించారు. ఇక ఇటీవల హైదరాబాద్‌లో మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ నిర్వహించిన ధన్యవాదాల సమావేశానికి తనకు ఆహ్వానం అందలేదని మోత్కుపల్లి నర్సింహులు తెలిపారు. సీఎం పిలవడం లేదు కాబట్టి ఆ సమావేశ నిర్వాహకులు కూడా తనను పిలవలేదేమోనని చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి ఎంత కాలం ముఖ్యమంత్రి కుర్చీలో ఉంటారో తన భుజాన మోస్తామని ఆయనకు చెప్పినట్లు వివరించారు. అయినప్పటికీ తాను ఏం పాపం చేశానో తనకే తెలియదని వందల సార్లు ఫోన్ చేసినప్పటికీ.. తనకు అపాయింట్‌మెంట్ మాత్రం ఇవ్వడం లేదని మోత్కుపల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇలా చేయడం చాలా బాధాకరమని పేర్కొన్న మోత్కుపల్లి.. రేవంత్ రెడ్డి మాదిగ కులాన్ని పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మాదిగలు పార్లమెంట్‌లో అడుగు పెట్టొద్దన్నట్లు తమ వర్గం వారికి టికెట్లే ఇవ్వలేదని ఆరోపించారు. రాజ్యసభ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా మాదిగలకు సరైన అవకాశం ఇవ్వకుండా తమను చట్టసభల్లో అడుగే పెట్టొద్దన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. వందల కార్పొరేషన్లు వేస్తే అందులో ఒక్కటే మాదిగలకు ఇచ్చారని అసహనం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుండా.. మనం కలిసి ఉన్నాం, కలిసి ధావత్‌లు చేసుకుందాం అని చెబితే వాటితో ఎవరికి సంతోషమని ఈ సందర్భంగా మోత్కుపల్లి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిపై తమకు ఎలాంటి కోపం లేదని పేర్కొన్న ఆయన.. తమ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మాదిగలు రాజ్యాధికారం కోసం సంఘటితం కావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మోత్కుపల్లి పిలుపునిచ్చారు. అందుకోసమే మాదిగ మహాశక్తి (ఎంఎంఎస్) అనే సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. ఎంఎంఎస్ అంటే ఒక రాజకీయ పార్టీ కాదని.. జాతి ప్రయోజనాల కోసం పని చేసే సంస్థ అని స్పష్టం చేశారు. మాదిగల వద్ద రాజకీయంగా ఓట్లు ఉన్నాయని.. వాటిని సరిగ్గా ఉపయోగించుకుంటే ఎవరినైనా అధికారంలో ఉంచవచ్చని.. అదే సమయంలో ఎవరినైనా అధికారం నుంచి దించేయవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాదిగ మహాశక్తి డెసిషన్ మేకర్‌గా ఉండబోతోందని పేర్కొన్నారు. చట్టసభల్లో మాదిగల హక్కులను తీసేసి అందరం కలిసి ఉంటామని అనడం ఏంటని నిలదీశారు. తన జీవితంలో రేవంత్ రెడ్డి చేసిన ఒకే ఒక్క మంచి పని ఎస్సీ వర్గీకరణ అని తెలిపారు. ఈ నిర్ణయంతోనే తనకు రేవంత్ రెడ్డిపై ఉన్న అభిప్రాయాన్ని మార్చుకుని.. మాదిగ జాతిని కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా చేయడం కోసం ఈ ఎంఎంఎస్ పెట్టానని వెల్లడించారు. తాను రేవంత్ రెడ్డి విషయంలో పాజిటివ్‌గానే ఉన్నానని.. కానీ ఆయనే నెగిటివ్ అయ్యేలా చేసుకుంటున్నారని విమర్శించారు.

## బయటికి రావొద్దు

మొదటి పేజీ తరువాయి

మంది సామాన్యుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, దాడులు తీవ్రమవుతున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్ కామ్) ప్రకారం.. ఇరాన్ మిలటరీ డెజ్ ఫుల్, ఇస్ఫహాన్, షిరాజ్ వంటి రద్దీగా ఉండే నగరాల నుంచి తమ కార్యకలాపాలు సాగిస్తోంది. ఇలాంటి ప్రాంతాలను సైనిక అవసరాలకు వాడటం వల్ల అంతర్జాతీయ చట్టాల ప్రకారం అవి రక్షణ హోదాను కోల్పోతాయని, ప్రతీకార దాడులకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇరాన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అమాయక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతోందని సెంట్ కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఆరోపించారు. ఇరాన్ తమ పొరుగు దేశాల్లోని పౌర విమానాశ్రయాలు, హోటళ్లపై కూడా విచక్షణారహితంగా దాడులు చేస్తోందన్నారు. తాము పౌరులకు హాని కలగకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అయితే ఇరాన్ సైనిక స్థావరాలుగా వాడుకుంటున్న ప్రాంతాల్లో భద్రతకు గ్యారంటీ ఇవ్వలేమని అమెరికా స్పష్టం చేసింది. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ వందల కొద్దీ క్షిపణులను ప్రయోగించినప్పటికీ, తమ ప్రతిఘటనతో ఆ వేగం తగ్గిందని పేర్కొంది. మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో మధ్యప్రాచ్యం నుంచి అమెరికన్లను సురక్షితంగా తరలించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు 32,000 మందికి పైగా అమెరికన్లు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారని అసిస్టెంట్ సెక్రటరీ డైలాన్ జాన్సన్ తెలిపారు. ఒమన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల నుంచి ప్రత్యేక విమానాల ద్వారా తరలింపు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## నిప్పుల వాన

మొదటి పేజీ తరువాయి

నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచించారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 40 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు నమోదయ్యే చాన్స్ ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఆకాశం పూర్తిగా నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకుతోందని.. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తీవ్రమైన ఉక్కపోత, వేడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ సమయంలో బయటకు రాకుండా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు. తెలంగాణలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో ఎండ ప్రభావం మరీ ఎక్కువగా ఉండనుందని చెప్పారు. నిజామాబాద్, ఆదిలాబాద్, రామగుండం ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 36 డిగ్రీల మార్కును దాటాయని చెబుతున్నారు. సోమవారం ఈ జిల్లాల్లో పొడి గాలులు వీచే అవకాశం ఉందని.. ఇక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని చెబుతున్నారు. ఈ మేరకు ఎండ తీవ్రత నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలంటున్నారు. తేలికపాటి త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని పండ్ల రసాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలంటున్నారు. దాహం వేయకపోయినా తరుచూ నీళ్లు తాగాలని తద్వారా శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాదని అంటున్నారు. మసాలా ఫుడ్స్, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

## విద్యార్థినులకు స్కూటీలు

మొదటి పేజీ తరువాయి

సంఘాల ద్వారా రుణాలు, గృహలక్ష్మి పథకం ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇవ్వడం ద్వారా వారి విద్యకు, స్వావలంబనకూ మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు మరో భారీ నిర్ణయాన్ని సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో కాలుష్యమే పెద్ద అడ్డంకిగా మారిందని, ఇది నాన్ లివింగ్ సిటీగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. డిసెంబర్ 9వ తేదీలోపు నగరంలో డీజిల్ బస్సులు కనిపించవని, ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులన్నింటినీ జిల్లాలకు తరలిస్తామని తెలిపారు. నగర ప్రజల కోసం ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. అంతేకాకుండా, నగరంలో తిరిగే పెట్రోల్, డీజిల్ ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామని చెప్పారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తే 'జీరో ట్యాక్స్' విధిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను వెలుపలికి తరలిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా నిలుస్తోందని, ఆ వారధికి సారథులుగా ఉన్న మహిళా జర్నలిస్టులను సత్కరించుకోవడం సంతోషంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ మహిళా జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు డిజిటల్ కరెన్సీ రూపంలో కానుకలు అందజేశారు. రెండేళ్ల ప్రజాపాలనలో వచ్చిన మార్పులకు ఆడబిడ్డలే ప్రత్యక్ష సాక్షులని, తన ప్రభుత్వానికి వారే బ్రాండ్ అంబాసిడర్లని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు.

## భారత్ ముఖ్యం

మొదటి పేజీ తరువాయి

ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించారు. అమెరికా ఆంక్షల కారణంగా సముద్రంలో నిలిచిపోయిన రష్యన్ క్రూడ్ ఆయిల్ షిప్‌మెంట్‌లను భారతీయ రిఫైనరీలు కొనుగోలు చేసేందుకు ఈ 30 రోజుల గడువు ఉపయోగపడుతుందని ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి సమీపంలో భద్రతా కారణాల రీత్యా ఆయిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉండటంతో, అంతర్జాతీయ మార్కెట్లో కొరత రాకుండా ఉండేందుకు ఈ తాత్కాలిక నిర్ణయం తీసుకున్నామన్నారు.

నుగోలు ద్వారా రష్యాకు కొత్తగా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఉండదని ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా, అమెరికాలోనూ ఆయిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, పరిస్థితి త్వరలోనే సర్దుబాటు అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్ మాట్లాడుతూ.. ఇది కేవలం స్వల్పకాలిక చర్య మాత్రమేనని, ప్రపంచ చమురు ధరలను స్థిరంగా ఉంచడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. రష్యాపై ఉన్న తమ ఆంక్షల విధానంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.




# అస్మిత లీగ్.. అతివల సత్తా

## మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఆటలు.. ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

సికింద్రాబాద్, మార్చి 8 (ఈవార్తలు): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో 'అస్మిత లీగ్' పేరుతో క్రీడలు, వేడుకలను నిర్వహించింది. ఈ వేడుకల్లో దాదాపు 500 మంది క్రీడాకారిణులు పాల్గొని మహిళా సాధికారతను చాటిచెప్పారు. 13 ఏళ్ల లోపు, 13–18 ఏళ్ల మధ్య, 18 ఏళ్ల పైబడిన వయస్కుల వారికి పరుగు పోటీలను నిర్వహించారు. యువతుల్లో ప్రతిభ, వారిలోని పోటీతత్వాన్ని ప్రోత్సహించడానికి 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్ చైర్‌పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, ప్రసార భారతి (ఆకాశవాణి) అసిస్టెంట్ డైరెక్టర్ సీమా కుమారి, అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి సౌందర్య, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్‌పర్సన్ బీ మాధవి, జాతీయ రోయింగ్ క్రీడాకారిణి – ఆసియా క్రీడల ప్రతినిధి గీతాంజలి, జిల్లా యువజన, క్రీడా అధికారి నందకిషోర్ గోకుల్ హాజరై.. మహిళా సాధికారతపై సందేశం ఇచ్చారు. క్రీడలు, ఆరోగ్యం, శారీరక దృఢత్వంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. క్రీడలను ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే మార్గంగా ఎంచుకోవాలని యువ క్రీడాకారిణులను ప్రోత్సహించారు. విజేతలతో పాటు రెండో స్థానంలో నిలిచిన వారికి ధ్రువీకరణ పత్రాలు, పతకాలను అందజేశారు. క్రీడా ప్రయాణాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగించాలని సూచించారు.

## కాంగ్రెస్ వల్లే ఇరాన్‌తో సంబంధాలు బీటలు

**బీజేపీ టీజీ అధ్యక్షుడు రాంచందర్‌రావు**

హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): 2005లో యూపీఏ ప్రభుత్వం ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిందని, దీనితో 2012లో మనకు ఇరాన్ ఆయిల్ సరఫరా నిలిపివేసింది తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యూపీఏ ప్రభుత్వం ఆరోజు తీసుకున్న నిర్ణయం భారత్, ఇరాన్ సంబంధాలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా పర్వాలేదు కానీ ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు. గతంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్, ఇప్పుడు ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ, భారతదేశంలో చమురు కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. యూపీఏ హయాంలో కేవలం 16 దేశాల నుంచి మాత్రమే చమురు దిగుమతి చేసుకునే వారమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 40 దేశాలకు పెరిగిందని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆయన హామీ ఇచ్చారు. దేశంలో తగినంత ఇంధనం, గ్యాస్ స్టాక్ ఉందని రామచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆందోళన కలిగించే అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. చైనాతో రహస్య ఒప్పందాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. తెలంగాణలో ఖజానా ఖాళీ అయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం కథలు చెబుతున్నారని, కానీ అదే ప్రజల ధనంతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని తెలిపారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు.

## ఇస్కాన్‌తో ఆధ్యాత్మికత విస్తరణ

**మంత్రి కొండా సురేఖ వెల్లడి**

**ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ**

హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): సైబరాబాద్ పరిధిలోని నలగండ్లలో నిర్మించబోయే అతిపెద్ద ఇస్కాన్ దేవాలయం నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాల నడుమ కొండా సురేఖ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇస్కాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. భారతీయ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంలో వారి పాత్ర గొప్పదని కొనియాడారు. వారు కృష్ణతత్వాన్ని బోధించడంతో పాటుగా పేదవారికి ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో నేను పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వంలో దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి కోసం కాళ్లు అరిగేలా తిరిగారని అయినా వారికి స్థలం కేటాయించలేదని ఆరోపించారు.

# దోమల పనిపట్టండి

**హైదరాబాద్‌లో దోమల బెడద**

**తక్షణ నివారణ చర్యలు చేపట్టండి**

**జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పొన్నం ఆదేశం**



హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లో దోమల బెడద ఎక్కువగా ఉందని వరుస ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఇటీవల జరిగిన హైదరాబాద్ జిల్లా 99 రోజుల కార్యాచరణలో ప్రధానంగా దోమల బెడద తీవ్రత వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజా ప్రతినిధులు లేవనెత్తడంతో స్పందించిన మంత్రి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ప్రాంతంలో దోమల సాంద్రతను తగ్గించేలా ఎంటమాలజికల్ సర్వైలెన్స్‌ను బలోపేతం చేయాలని, అధిక దోమల ప్రభావిత ప్రాంతాల్లో 100 శాతం జ్వరం పర్యవేక్షణ చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, గత 3 సంవత్సరాల డేటా ఆధారంగా అధిక దోమల ప్రభావిత ప్రాంతాల్లో వచ్చిన వ్యాధులను గుర్తించి పీహెచ్సీల ద్వారా ప్రాథమిక లార్వా సర్వేలు నిర్వహించాలని, దోమల సాంద్రతను నియంత్రణ స్థాయిలో ఉంచాలని పేర్కొన్నారు. గత 12 నెలల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా కేసుల లైన్ లిస్టింగ్ చేసి ప్రధాన ప్రాంతాలైన పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, నీటి నిల్వ ప్రాంతాలు, స్లమ్ ప్రాంతాలను గుర్తించి వార్డ్ వారీగా మైక్రో ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ఫీల్డ్ సిబ్బందికి ఫాగింగ్, ఐఆర్ఎస్ షెడ్యూల్ నిర్వహించాలని, ప్రతి వారం "డ్రై డే" నిర్వహిస్తూ.. నీటి నిల్వలు తొలగించాలని, టెమెఫోస్ రసాయనాల వినియోగం, చేపల ద్వారా లార్వా నియంత్రణ, చెరువులు, కాలువల్లో ఆయిల్ బాల్స్ విడుదల, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఫాగింగ్, నిర్మాణ స్థలాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల పరిశీలన చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యం, పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు, ఆర్‌డబ్ల్యూఏఎస్ కాంట్రాక్టర్లు, వాటర్ వర్క్స్ విభాగం సహకారం తీసుకోవాలని, ప్రతి ఆదివారం 10 నిమిషాలు దోమల నివారణకు మీడియా ప్రచారం నిర్వహించాలని మంత్రి అన్నారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తూ.. దోమల పెంపక స్థలాలను జియో ట్యాగింగ్ చేయడం, లార్వా సాంద్రత మ్యాపింగ్ ద్వారా పరిస్థితులను నిరంతరం సమీక్ష చేయాలని, ప్రజలు తమ ఇండ్లతో పాటు పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల నియంత్రణలో సహకరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు.

# కొత్త హంగులతో మండలి భవనం

**ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

**పాత బిల్డింగ్‌లో మండలి సమావేశాలు**

**రూ.30 కోట్లతో పాత భవనం ఆధునీకరణ**

**ఒకే ప్రాంగణంలో ఉభయ సభలు**



హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని చారిత్రక పాత అసెంబ్లీ భవనం ఇకపై శాసన మండలి (లెజిస్లేటివ్ కౌన్సిల్)గా సేవలు అందించనుంది. అత్యాధునిక హంగులతో ఆధునీకరించిన ఈ భవనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాలు ఈ కొత్త భవనంలోనే జరగనున్నాయి. నిజాం కాలం నాటి ఇండో–సార్సెనిక్ వాస్తుశైలిలో నిర్మితమైన ఈ భవనంలో గతంలో హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీ, ఆ తర్వాత ఉమ్మడి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరిగేవి. 2014 రాష్ట్ర విభజన తర్వాత దీనిని ఏపీ అసెంబ్లీకి కేటాయించారు. అయితే ఏపీ అసెంబ్లీ అమరావతికి తరలివెళ్లడంతో ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అసెంబ్లీ మరియు కౌన్సిల్ రెండూ ఒకే ప్రాంగణంలో ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ (ఏకేటీసీ) సహకారంతో రూ.30 కోట్లతో 18 నెలల పాటు ఈ పనులు సాగాయి. ఇందులో అధునాతన డ్రైనేజీ, ఎలక్ట్రికల్ సిస్టమ్స్, ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. సీఎం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కోసం ప్రత్యేక ఛాంబర్లు, మీడియా హాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ భవనం పార్లమెంట్ తరహాలో ఎంతో అద్భుతంగా ఉందని, సభ్యులకు అన్ని సౌకర్యాలు కల్పించామని మండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు జూబ్లీహాల్‌లో మండలి సమావేశాలు జరుగుతుండగా, ఇకపై ఆ హాల్‌ను ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు వినియోగించనున్నారు. అలాగే ఉభయ సభల సంయుక్త సమావేశాల కోసం కొత్త సెంట్రల్ హాల్ నిర్మించే యోచనలో కూడా ప్రభుత్వం ఉంది.



# గచ్చిబౌలి స్టేడియంలో హాకీ టోర్నమెంట్ ప్రారంభం

గచ్చిబౌలి–హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రతిష్టాత్మక మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భారత్‌కు ఉరుగ్వే జట్టుకు మధ్య మ్యాచ్‌ను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరగనున్న ప్రపంచ హాకీ కప్ కోసం క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల టోర్నమెంట్‌లో 8 దేశాలు పాల్గొంటున్నాయి. గ్రూప్–ఏలో ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఇటలీ, కొరియా దేశాలు, గ్రూప్–బీలో ఇండియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓల్డ్ సిటీకి ఎన్ని నిధులైనా ఇస్తా

**బుమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్**

హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా నది పరివాహక ప్రాంతాన్ని నైట్ ఎకానమీ కొనసాగే విధంగా అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ శివరాంపల్లిలో పునరుద్ధరించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన బుమ్–రుక్న్–ఉద్–దౌలా చెరువును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, ఉన్నధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలకు అద్భుతమైన సంస్కృతిని అందించడానికి బుమ్–రుక్న్–ఉద్–దౌలా చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని చెప్పారు. హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరించిన ప్రాంతాల్లో నైట్ ఎకానమీ కొనసాగే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 'స్థానిక పౌరులకు మంచి వాతావరణం కల్పించాం. ఇక్కడ ఆడబిడ్డలు స్వేచ్ఛగా ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేసుకోవడానికి ఇక్కడ లేక్ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. అలాగే, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ లేక్స్ వద్ద స్టాల్స్ పెట్టి స్థానికులు పాలు, పండ్లు, కూరగాయలు పరిశుభ్రమైన వాతావరణంలో అమ్ముకోవడానికి వీలు కల్పిస్తాం. 99 రోజుల 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా హైదరాబాద్‌లో అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఒకప్పుడు హైదరాబాద్ రాక్స్, లేక్స్‌తో ప్రపంచంలోనే సుందరమైన నగరంగా ఉండింది. ఈ నగరం మనది. దీన్ని రక్షించుకోవలసిన బాధ్యత కూడా అందరిపైన ఉంది. ఈ మహానగరానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న సంకల్పంతో ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాలను తొలగించే కార్యక్రమం చేపట్టాం. ఇది ఓల్డ్ సిటీ కాదు. ఒరిజినల్ సిటీ. ఈ సిటీని అభివృద్ధి చేయడానికి అనేక ప్రాజెక్టులు చేపట్టాం. రెండు రోజుల కిందట కొత్వాల్ గూడ ఎకో పార్క్‌ను ప్రారంభించుకున్నాం. సాధ్యమైన తొందరగా మెట్రో విస్తరణ పనులను పూర్తి చేస్తాం. మిరాలం ట్యాంక్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. పక్కనే హైకోర్టు నూతన భవన నిర్మాణం సాగుతోంది. ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. హైదరాబాద్ అత్యంత పురాతన, ప్రాముఖ్యత కలిగిన నగరం. ఆ ప్రాభవం కోల్పోయే ప్రమాదం ఉంది. దీన్ని ఒక సుందరమైన నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేశాం. ఏడాది కిందట బుమ్–రుక్న్–ఉద్–దౌలా చెరువు ఎలా ఉంది. ఇప్పుడేలా ఉంది. ఈ ఒరిజినల్ సిటీని అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను చూడండి. ఆ పనులను చూసి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి' అని ముస్లింలను కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏ ఇంట్లో పుట్టినా మహిళలపై వివక్ష తప్పదు

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**పెద్దకులం, చిన్నకులమంటూ ఏదీ లేదని వ్యాఖ్య**

**మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమం లేదని వెల్లడి**



హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): పెద్దకులం, చిన్నకులమంటూ ఏదీ లేదని మహిళలందరిదీ ఒకే కులమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఏ ఇంట్లో పుట్టినా సరే వారిపై వివక్ష ఉంటుందని అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. 'గివ్ హర్ స్పేస్' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'స్టాండ్ విత్ హర్' కాదు, 'గివ్ హర్ స్పేస్' జాగృతి నినాదమని వెల్లడించారు. కేవలం మహిళా దినోత్సవం రోజే కాదని, ప్రతిరోజు మహిళని గౌరవించాలని ఆమె సూచించారు. మహిళను తండ్రి, భర్త, అన్న ఇలా అందరూ తక్కువగానే చూస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదని ఆమె పేర్కొన్నారు. సామాజిక తెలంగాణ సాధనలోనూ వారి పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలపై నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించిందని అన్నారు.

## పెంచలేకే.. చంపేశాడు!

**కామారెడ్డి చిన్నారుల కేసులో వీడిన మిస్టరీ**

కామారెడ్డి, మార్చి 8 (ఈవార్తలు): కామారెడ్డి పట్టణంలో ముగ్గురు పిల్లల అదృశ్యం కేసులో మిస్టరీ వీడింది. ఆర్థిక ఇబ్బందులు భరించలేక కన్న తండ్రే తన ముగ్గురు కుమార్తెలను చెరువులో తోసి చంపేశాడు. ఈ ఘటనలో షిఫత్ (8), అయత్ (7), మరియం (5) అనే ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. నిందితుడైన తండ్రి, ఆటో డ్రైవర్ ఇస్మాయిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఏఎస్పీ చైతన్య రెడ్డి మీడియా సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఇస్మాయిల్ తన భార్యతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఉదయం 10 గంటల నుంచి తన ముగ్గురు కూతుళ్లు కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సోషల్ మీడియాలో బాలికల ఫోటోలు షేర్ చేసి గాలింపు చేపట్టారు. విచారణలో భాగంగా, పిల్లలను అల్పాహారం కోసం హోటల్‌కు తీసుకెళ్లి తర్వాత వదిలేశానని ఇస్మాయిల్ చెప్పాడు. అయితే, ఎక్కడ వదిలేశాడనే విషయంపై పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. సీసీటీవీ ఫుటేజ్, నిందితుడి ఫోన్ కాల్ రికార్డులను పరిశీలించిన అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని గట్టిగా విచారించగా, తానే వారిని పెద్దచెరువులో తోసి చంపినట్లు అంగీకరించాడు. దాదాపు రూ. 5 లక్షలకు పైగా అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చలేక, పిల్లలను పోషించలేక ఈ దారుణానికి పాల్పడినట్లు ఇస్మాయిల్ పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. నిందితుడి భార్య షబీనా కూలి పనులకు వెళ్లిన సమయంలో ఈ ఘాతుకం జరిగింది. గజ ఈతగాళ్ల సహాయంతో పోలీసులు శనివారం రాత్రి ఇద్దరి, ఆదివారం ఉదయం మరొకరి మృతదేహాన్ని వెలికితీశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కేసులో లోతైన విచారణ కోసం నిందితుడిని పోలీస్ కస్టడీకి కోరతామని ఏఎస్పీ తెలిపారు.

## సైబర్ బ్లాక్‌మెయిలింగ్‌ను ధైర్యంగా ఎదుర్కొందాం

**సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్**

హైదరాబాద్, మార్చి 8 (ఈవార్తలు): ప్రతి మహిళా ఆన్‌లైన్‌లో సురక్షితంగా, ధైర్యంగా ఉండాలని, సైబర్ బ్లాక్ మెయిలింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్ తెలిపారు. మహిళ దినోత్సవం సందర్భంగా సైబర్ బ్లాక్ మెయిలింగ్ పై అవగాహన కలిగిస్తూ ఆదివారం వీడియో విడుదల చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, డబ్బులు అడిగితే పంపవద్దని సూచించారు. ఇలాంటి బెదిరింపులు వచ్చిన సమయంలో భయాన్ని వీడి , ధైర్యంగా సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఒకసారి డబ్బు పంపితే వారు పదే పదే బ్లాక్‌మెయిల్ చేస్తూనే ఉంటారని, ఏదైనా సైబర్ బెదిరింపు లేదా స్పామ్ కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాని సూచించారు. సైబర్ నేరాలు మౌనం సంకోచం చెందవద్దని, అవగాహనతో పరిస్థితిని మార్చవచ్చని, ప్రతి మహిళా ఆన్‌లైన్‌లో సురక్షితంగా, ధైర్యంగా ఉండాలని ఆశిస్తున్నట్లు డీజీ తెలిపారు.

## భార్యతో గొడవ.. మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మల్యాల, మార్చి 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన రాయకొండ అశోక్ అనే వ్యక్తి తన భార్య సుజాతతో తరచూ గొడవలు పడేవాడు. గొడవలతో తీవ్ర మనస్తాపానికి గురైన అశోక్.. ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని అతని తల్లి తెలిపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## స్వర్ణకారుల అభివృద్ధే లక్ష్యం

**మల్యాల నూతన అధ్యక్షుడు ఎన్నిక**

మల్యాల, మార్చి 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం మల్యాలో నూతన స్వర్ణకార సంఘం అధ్యక్షుడిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షుడు అకోజు చంద్ర శేఖర్, అధ్యక్షుడు కన్నోజు రామ్మోహన్, ఉపాధ్యక్షుడు అకోజు రమణ, కార్యదర్శి కన్నోజు రవీందర్, సహాయ కార్యదర్శి గుగ్గిళ్ల సంతోష్, క్యాషియర్ వంగళ కృష్ణ చారి, సలహాదారులను ఎన్నుకున్నారు.



## బర్కత్‌పురలో ఇఫ్తార్ విందు

హైదరాబాద్,మార్చి 8 (ఈవార్తలు): రంజాన్ మాసంలో ముస్లింలు రోజా పాటిస్తూ అల్లాను ఆరాదిస్తారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అన్వర్ ఉలూం ఇనిస్టిట్యూట్స్ సెక్రటరీ నవాబ్ మహబూబ్ అలంఖాన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ఆధ్వర్యంలో ఆదవారం రాత్రి బర్కత్‌పురలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బీ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ముజాయిద్ అలంఖాన్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రంజాన్ అనేది పేద, ధనిక భావం లేకుండా అందరినీ సమానంగా చూస్తుందని, ఇఫ్తార్ విందు ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూస్తుందని పేర్కొన్నారు.

## నారీశక్తి వట్టిమాటే

**మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్**



విజయవాడ, మార్చి 8 (ఈవార్తలు): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. ఆకర్షణీయమైన పథకాలతో మహిళలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మహిళలకు ఇచ్చిన మూడు హామీలను విస్మరించి నయవంచనకు పాల్పడిందని షర్మిల విమర్శించారు. 'మహాశక్తి' పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి 1.80 లక్షల మందిని, 'తల్లికి వందనం' కింద 20 లక్షల మంది తల్లులను మోసం చేశారని ఆరోపించారు. వడ్డీ లేని రుణాల హామీతో 1.18 లక్షల డ్వాక్రా మహిళలను వంచించారని అన్నారు. ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచి వంటింటిపై భారం మోపారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై కూడా షర్మిల విమర్శలు చేశారు. దేశంలో గంటకు 50 మంది మహిళలపై దాడులు జరుగుతుంటే 'నారీశక్తి వందన్' ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారిని అర్ధరాత్రి అరెస్టు చేయించి అవమానించారని దుయ్యబట్టారు. రెండేళ్ల పాలనలో కుటుంబాలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వం, మహిళలను ఉద్ధరించామని చెప్పుకోవడానికి సిగ్గుపడాలని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు గ్యాస్ ధరల భారాన్ని ప్రభుత్వమే మోసేదని ఆమె గుర్తుచేశారు.

## రాష్ట్రపతికి అవమానంతో ప్రజాస్వామ్యం అపహాస్యం

**మమతా బెనర్జీపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ మండిపాటు**

విజయవాడ, మార్చి 8 (ఈవార్తలు): పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని, ఇది తీవ్ర ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సంతాల్ కాన్ఫరెన్స్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు. సంతాల్ సమాజం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేందుకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో.. అదే సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతికి సరైన ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరమని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ పాటించడంలో, అధికారుల సమన్వయంలో మమతా సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అక్కడి పరిపాలనలోని అరాచక ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు. దేశ పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా, ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి గౌరవాన్ని కూడా కాపాడలేని స్థితిలో బెంగాల్ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గిరిజన సోదర సోదరీమణులు ఎంతో ఆత్మీయంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతిని అవమానించడం అంటే.. అది దేశాన్ని అవమానించడమేనని మాధవ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ ఘటనను నిరసిస్తున్నారని, ఇలాంటి చర్యలే టీఎంసీ ప్రభుత్వ పతనాన్ని సూచిస్తున్నాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# రైతు ఏడ్చిన రాజ్యం బాగు పడదు

## టెకీలు రైతులుగా మారే రోజులు రావాలి.. కేంద్రమంత్రి బండి సంజయ్



మెదక్, మార్చి 8 (ఈవార్తలు): ఉద్యోగులు కూడా రైతులుగా మారి వ్యవసాయం చేసే స్థాయికి రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులు తన కాళ్లమీద తాను నిలబడేందుకు ప్రత్యేకంగా శిక్షణిస్తూ వారి పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి విక్రయిస్తూ లాభాలు గడించేలా శిక్షణ ఇస్తున్న ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్, క్రుషి విజ్ఞాన కేంద్రం చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని...అందులో భాగంగా విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలోని తునికిలోని డాక్టర్ రామానాయుడు – ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్– కృషి విజ్ఞాన కేంద్రం నూతనంగా నిర్మించిన రైతు వసతి గ్రుహంతోపాటు "ఫార్మర్స్ వాల్యూ అడిషన్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ ల్యాబోరేటరీ" కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే అంతా కలియతిరిగారు. రైతుల అభ్యున్నతి కోసం కేవీకే చేస్తున్న క్రుషిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. దేశంలో అనేక సంస్థలున్నా.. నిజాయితీ, నిబద్ధతతో, కసితో రైతుల కోసం లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్న సంస్థ ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం. కార్పొరేట్ హాస్టళ్లను మైమరపించేలా హాస్టల్‌ను నిర్మించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పేరుతో రైతులకు శిక్షణ ఇవ్వాలనుకోవడం చాలా సంతోషం. విద్య, ఆరోగ్యం, సేంద్రీయ వ్యవసాయం విషయంలో ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాగయ్య అలుపెరగని క్రుషి చేస్తున్నారు. ఉన్నత విలువలు, దేశ సేవకు కట్టుబడి మాలాంటి ఎందరో కార్యకర్తలను తయారు చేసిన గురువర్యులు అని కొనియాడారు.

### సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

'సర్వరోగాలకు కారణం మనమే. సనాతన ధర్మాన్ని, సేంద్రియ వ్యవసాయాన్ని, ఆరోగ్యాన్ని విస్మరించడంవల్లే ఈ దుస్థితి వచ్చింది. ఇప్పటికైనా రసాయనాల్లేని సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం. అందులో భాగంగా ఈరోజు "ఫార్మర్స్ హాస్టల్, వాల్యూ అడిషన్ ఓ ఫుడ్ ల్యాబ్" ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది' అని బండి సంజయ్ అన్నారు. 'రైతులు శిక్షణ కోసం వచ్చినప్పుడు అవసరమైన వసతి సదుపాయం కల్పించడంతోపాటు పంటలకు విలువ పెంచే విధానాలు నేర్పేందుకు వాల్యూ అడిషన్ ఓ ఫుడ్ ల్యాబ్ ప్రారంభించడం ఆనందంగా ఉంది. రైతులు పండించే పంటలతో ఏయే ఉత్పత్తులు తయారు చేయవచ్చు, వాటిని అందంగా ప్యాకింగ్ చేసి మార్కెట్ లో ఏ విధంగా విక్రయించవచ్చో ఇక్కడ నేర్పిస్తూ రైతులను రాజును చేయాలనే తపనతో శిక్షణను అందిస్తున్న నిర్వాహకులు అభినందనలు' అని తెలిపారు. 'ఒక్క మాటలో చెప్పాలంటే.... ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా టెక్నాలజీతోపాటు రైతుల ఉత్పాదక, మార్కెటింగ్ సామర్థ్యం పెరిగి తన కాళ్లపై తాను నిలబడేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ప్రధాని మోడీ సన్న, చిన్నకారు రైతులంతా కలిసి పెద్ద సంస్థలా పనిచేసేందుకు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. రైతులంతా కలిసి తాము పండించిన పంటను ఒకే చోటకు చేర్చడం, నిల్వ ఉంచడం, ఆ పంట ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయడం, ఆ ఉత్పత్తులను కలిసి మంచి ధరకు అమ్మడం వల్ల రైతులకు లాభాలు రావాలనే ఉద్దేశంతో ఈ ఎఫ్‌పీవో లను ప్రోత్సహిస్తున్నారు. 6 ఏళ్ల క్రితం ఈ పథకాన్ని ప్రారంభించడమే కాకుండా ఇప్పటి వరకు 6 వేల 865 కోట్లు ఖర్చు చేశారు. తద్వారా దేశవ్యాప్తంగా 10 వేల ఎఫ్‌పీవోలను స్థాపించాలనే లక్ష్యాన్ని చేరుకున్నారు. ఈ సంస్థల్లో 56 లక్షలకు పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇందులో సుమారు 22 లక్షలు మహిళా రైతులున్నారు. చిన్న రైతులకు మార్కెట్ శక్తి పెంచే ముఖ్యమైన వ్యవసాయ సంస్కరణలను తెచ్చిన ఘనత మోడీదే. ఈ తునికీ కేవీకే సైతం 2 ఎఫ్‌పీవో లను స్థాపించడంతోపాటు దత్తత గ్రామంలో ఒక సేంద్రీయ ఎఫ్‌పీవో ను ప్రోత్సహించడం నిజంగా అభినందనీయం. కిసాన్ సారథి పోర్టల్ ద్వారా మెదక్ జిల్లాలోని దాదాపు లక్ష మంది రైతులకు వ్యవసాయ సలహాలను అందించడం గొప్ప విషయం'అని కేంద్రమంత్రి బండి సంజయ్ కొనియాడారు.

### వ్యవసాయం మీదే ఆధారపడుతున్న 60 కోట్ల మంది భారతీయులు

'కేవలం వ్యవసాయ అభివృద్ధి కోసమే కాకుండా మోడీ వికసిత్ భారత్ సంకల్ప అభియాన్, స్వచ్ఛ భారత్, జల్ శక్తి అభియాన్ వంటి కార్యక్రమాల్లో జాతీయ ప్రచారాల్లో చురుకుగా పాల్గొంటూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తనికీ కేవీకే నిర్వాహకులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు'అని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు.'ఇక వ్యవసాయ రంగం విషయానికొస్తే... దేశంలో దాదాపు 60 కోట్ల మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. తెలంగాణలో 60 లక్షల మందికి రైతులు వ్యవసాయాన్ని నమ్ముకున్నారు. రైతు కుటుంబం సగటు నెలవారీ ఆదాయం ఎంతో తెలుసా? 10 నుండి 12 వేల రూపాయలకు మించి సంపాదించలేకపోతున్నారు. అంటే ఏటా సగటున 1 లక్షా 20 వేలు మాత్రమే వస్తోంది. సాఫ్ట్ వేర్ ఎంప్లాయి ఒక నెలలో సంపాదించే దానికంటే తక్కువ సంపాదన ఇది. ఒక్కోసారి ఆరుగాలం పండించినా ప్రక్రుతి వైపరీత్యాల కారణంగా చేతికొచ్చిన పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోంది. రైతుల్లో ఆదాయం కంటే అప్పులే ఎక్కువవుతున్నాయి. అందుకే రైతులకు పిల్లను ఇవ్వడానికి కూడా నేటి సమాజం వెనుకాడుతోంది. అయినా రైతు ఎన్నడూ బాధపడలేదు. కష్టమైనా నష్టమైనా పంట పండిస్తూ మన కడుపు నింపుతున్నడు. అట్లాంటి రైతును ఆదుకోవడం మనందరి కర్తవ్యం'అని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

### పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రతీ రైతు అకౌంట్లో ఏటా రూ.6వేలు

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రతి రైతు అకౌంట్లో ఏటా 6 వేలు (మూడు విడతలుగా) ఠంచన్‌గా ప్రధాని నరేంద్రమోడీ జమ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల కోట్ల రూపాయలకు పైగా సొమ్మును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత మోడీదే. అట్లాగే పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు బీమా పరిహారం అందిస్తున్న ఘనత కూడా నరేంద్రమోడీదే. ఇప్పటివరకు 1 లక్షా 50 వేల కోట్లకు పైగా క్లెయిమ్‌లు రైతులకు చెల్లించింది. కానీ మన తెలంగాణ విషయానికొస్తే... గత కేసీఆర్ ప్రభుత్వం ఐదారేండ్లపాటు ఈ స్కీంను అమలు చేయలేదు. పంట నష్టపోయిన రైతులకు తీవ్రంగా నష్టపోయారు. మేం పెద్ద ఎత్తున పోరాటం చేస్తే 2022 నుండి అమలు చేస్తున్నారు.అట్లాగే రైతులకు భూసార పరీక్షలు చేసి ఎరువుల వినియోగం ఎలా చేయాలో చెప్పేందుకు సాయిల్ హెల్త్ కార్డులను మోదీగారు అందించారు. దేశంలో 22 కోట్లకు పైగా సోయిల్ హెల్త్ కార్డులు ఇచ్చారు. ఒక్కో హెల్త్ కార్డుకు సగటున 3 వందల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 1706 కోట్లు ఖర్చు చేసినం. తెలంగాణలోనూ 1 కోటి 10 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు అందించినం. ఈ ఒక్క మెదక్ జిల్లాలోనే 3 లక్షల దాకా సాయిల్ హెల్త్ కార్డులిచ్చినం'అని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

### 7.70 కోట్ల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు

'దేశవ్యాప్తంగా 7 కోట్ల 70 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులివ్వడమే కాకుండా దాదాపు 12 లక్షల కోట్లకుపైగా రుణాలిచ్చారు. మన తెలంగాణలోనూ దాదాపు 40 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులిచ్చి దాదాపు 50 వేల కోట్ల రుణాలను అందించగలిగాం. అంటే విత్తనాలు, ఎరువులు మొదలు వ్యవసాయ యంత్రాలు, పశుసంవర్ధక, పాడి, చేపల పెంపకం దాకా అవసరమైనప్పుడు ఈ కార్డును ఉపయోగించి రుణాలు పొందవచ్చు'అని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పుకొచ్చారు. 'ఎరువుల సబ్సిడీ గురించి చెప్పాల్సిన పని లేదు. బహిరంగ మార్కెట్లో యూరియా బస్తా ధర 2400 నుండి 2700 దాకా ఉంటే సబ్సిడీపై 266 రూపాయలకే అందిస్తున్నాం. అంటే 2200 నుండి 2400 దాకా సబ్సిడీ భరిస్తున్నాం. అట్లాగే డీఏపీ 4 వేల రూపాయలకుపైగా ఉంటే 1360 రూపాయలకే అందిస్తూ 2 300లకు పైగా సబ్సిడీ భరిస్తున్నాం. యూరియా, డీఏపీ, పొటాషియం ఏటా ఒక్కో ఎకరానికి 18 వేల రూపాయలను రైతుకు ఆదా చేస్తున్నాం. ఒక్క ఎరువుల సబ్సిడీ పేరుతోనే మోదీ ప్రభుత్వం 12 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది'కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్

**నేనే అంబాసిడర్‌గా ఉంటా: చంద్రబాబు**



అమరావతి, మార్చి 8 (ఈవార్తలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఏపీ సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019–24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు. "మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు. ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి రావడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది. అలాంటి దుర్మార్గులను కఠినంగా హెచ్చరిస్తున్నా. మీ భద్రతకు చంద్రన్న ఉన్నంతవరకు భయపడాల్సిన అవసరం లేదు," అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఒక మహిళే (అనిత) ఉన్నారని, ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తారని గుర్తుచేశారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు 'ఒక బిడ్డ ముద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు వద్దు' అన్నాను. కానీ ఇప్పుడు 'ఒక బిడ్డ వద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు ముద్దు' అని చెబుతున్నాను. రాష్ట్రంలో జననాల రేటు 1.5కి పడిపోయింది. ఇది ప్రమాదకరం. అందుకే పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేందుకు అవసరమైతే మూడు పడకగదుల ఇల్లు, అదనపు రేషన్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని నూతన విధానాన్ని ప్రకటించారు.

## నారావారి నరకాసుర పాలన: రోజా

తాడేపల్లి, మార్చి 8 (ఈవార్తలు): మహిళా సాధికారత కోసం కృషి చేసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏపీ మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మహిళలు రాజకీయాల్లో ఎదగాలంటే చాలా కష్టమని.. కానీ వైఎస్ జగన్ ప్రోత్సాహంతో పార్టీలో ఎంతోమంది మహిళలు ఎదిగారని ఆమె పేర్కొన్నారు. ఆదివారం.. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా నేతలు ఆర్కే రోజాతో పాటు వరుదు కళ్యాణి, రాయన భాగ్యలక్ష్మి, పూజిత, హారిక సహా పలువురు పార్టీ నేతలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆర్కే రోజా మాట్లాడుతూ.. "నన్ను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రి పదవి ఇచ్చి వైఎస్ జగన్ ప్రోత్సాహించారన్నారు. కష్టపడే వారికి, టాలెంట్‌ఉన్న వారికి వైఎస్ జగన్ ఎప్పుడూ అవకాశం కల్పిస్తారు. వరుదు కళ్యాణి తన ఎమ్మెల్సీ పదవి అలంకార ప్రాయం కాదని.. ఆయుధమని నిరూపించారు. ప్రతి మహిళ ఒక శక్తిగా ఎదగాలి. టీమ్ వర్క్‌గా పని చేసి మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకోవాలి" అని ఆర్కే రోజా పేర్కొన్నారు. 'రాష్ట్రంలో నారావారి నరకాసుర పాలన సాగుతోంది. మహిళలకు రక్షణ కల్పించలేని దిక్కుమాలిన ప్రభుత్వం ఇది. హోంమంత్రి అనిత తన పదవిని పట్టించుకోకుండా ఆట, పాటలతో కాలం గడుపుతోంది. అనితతో పాటు మరో ఇద్దరు మంత్రులు మహిళలకు ఏం మేలు చేశారు?. అలాంటి మంత్రులు సబిత, అనిత, గుమ్మడి సంధ్యారాణిలకు మహిళా దినోత్సవం జరుపుకునే అర్హత లేదు. అన్యాయానికి గురైన మహిళలు ఫిర్యాదులు చేస్తే వారిమీదే కేసులు పెడుతున్న దుస్థితి నెలకొంది. కులం, మతం, పార్టీ చూడకుండా వైఎస్ జగన్ అందరికీ మేలు చేశారు. చంద్రబాబు మాత్రం కులం, మతం, పార్టీ చూసి అందరికీ వెన్నుపోటు పొడుస్తున్నారు. ఇలాంటి వ్యక్తికి మహిళా దినోత్సవం జరుపుకునే అర్హత లేదు. పవన్ కళ్యాణ్ సుగాలి ప్రీతి పేరు చెప్పుకుని, ఆమె తల్లి కన్నీటిని అడ్డు పెట్టుకుని రాజకీయం చేసిన వ్యక్తి. ముప్పై వేల మంది మహిళలు కనిపించకపోయారని చెప్పిన పవన్ ఈ ఇరవై నెలల్లో ఎంతమందిని తిరిగి తీసుకు వచ్చారు? మనం చేసిన మంచి వలనే ఇప్పటికీ జనం మనల్ని గౌరవవిస్తున్నారు. కూటమి నాయకులు గ్రామాల్లోకి వెళ్లే పరిస్థితే లేదు. చంద్ర మండలానికి కూడా చంద్రబాబు సీఎం అవుతాడని ఎల్లో మీడియా జాకీలు ఎత్తుతోంది.

## కల్తీ పాల ఘటనలో మరొకరు మృతి

రాజమండ్రి, మార్చి 8 (ఈవార్తలు) కల్తీ పాల ఘటనలో మరొకరు మృత్యువాత పడ్డారు. రాజమండ్రి శివారు లాలాచెరువు ప్రాంతానికి చెందిన శానాపతుల రామలక్ష్మి(73) మృతి చెందారు. ఆదివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె ప్రాణం కోల్పోయారు. ఫిబ్రవరి 16వ తేదీ నుంచి డెల్టా హాస్పిటల్‌లో రామలక్ష్మి చికిత్స పొందుతున్న ఆమె తుది శ్వాస విడిచారు. దాంతో కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య 11కు చేరింది. అయితే అనధికారికంగా మృతుల సంఖ్య 12గా ఉంది. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఐదుగురు రోగులు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి ఆందోళనగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ముగ్గురు చిన్నారులున్నారు. కాగా, రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి 21 మంది ఆస్పత్రుల పాలైన విషయం తెలిసిందే. రోజురోజుకూ మృతుల సంఖ్య పెరుగుతూండటం.. బాధిత కుటుంబాలను తీరని విషాదంలో ముంచుతోంది. మరోవైపు చికిత్స పొందుతున్న వారి పరిస్థితి సైతం విషమంగానే ఉంది. వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. అయితే, వారి విషయంలో విశాఖపట్నం, హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు సైతం ఇప్పటికే చేతులెత్తేశారు. ప్రస్తుతం జరుగుతున్న చికిత్సే కొనసాగించాలంటూ ఉచిత సలహా ఇచ్చి వెనుదిరిగారు. తాజాగా మరొకరు మృతి చెందడంతో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



# గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర దాడులు

## కువైట్, సౌదీలలో ఉద్రిక్తత

టెహ్రాన్: గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. ఆదివారంతో ఈ ప్రాంతీయ యుద్ధం రెండో వారంలోకి అడుగుపెట్టింది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ మరోసారి క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఇంధన ట్యాంకులే లక్ష్యంగా శత్రు డ్రోన్లు చొరబడ్డాయని ఆ దేశ సైన్యం వెల్లడించింది. వీటిని అడ్డుకునే క్రమంలో పడిన శకలాల వల్ల కొన్ని పౌర నివాసాలకు నష్టం వాటిల్లింది. ముందుజాగ్రత్త చర్యగా కువైట్ నేషనల్ ఆయిల్ కంపెనీ ముడి చమురు ఉత్పత్తిని తగ్గించింది. ఇక సౌదీ అరేబియాలో రాజధాని రియాద్‌లోని దౌత్య కార్యాలయాలు, అమెరికా బలగాలున్న 'ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్' లక్ష్యంగా వచ్చిన 15 డ్రోన్లు, 3 బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేసినట్లు సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఖతార్‌పై ప్రయోగించిన 12 క్షిపణులను కూడా విజయవంతంగా అడ్డుకున్నారు. శనివారం దుబాయ్ విమానాశ్రయం పరిసరాల్లో గుర్తుతెలియని వస్తువును కూల్చివేయడంతో, విమానాశ్రయాన్ని కాసేపు మూసివేశారు. ఆకాశంలో జరిగిన ఈ ఇంటర్‌సెప్షన్ వల్ల రాలిన శకలాలు తగిలి ఒక పాకిస్థాన్ జాతీయుడు మరణించాడు. ఈ పరిణామాలపై యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ స్పందిస్తూ.. "ప్రస్తుతం ఎమిరేట్స్ యుద్ధంలో ఉంది, దీని నుంచి మనం మరింత బలంగా బయటపడతాం" అని జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 221 బాలిస్టిక్ క్షిపణులు, 1300కు పైగా డ్రోన్లను గుర్తించినట్లు యూఏఈ రక్షణ శాఖ తెలిపింది. ఇకపై దాడులు చేయబోమని ఇరాన్ అధ్యక్షుడు గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పినప్పటికీ, ఆ దేశ జ్యుడీషియరీ చీఫ్ మాత్రం శత్రువుల స్థావరాలపై దాడులు కొనసాగుతాయని హెచ్చరించడం గమనార్హం. గల్ఫ్ దేశాలకు అమెరికా మిత్రదేశం కావడం, అక్కడ అమెరికా సైనిక స్థావరాలు ఉండటంతో యూఏఈపై ఇరాన్ ఎక్కువగా గురిపెట్టినట్లు తెలుస్తోంది.



## జేడీయూలో చేరిన నితీశ్ తనయుడు

పాట్నా: బీహార్ రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం పట్నాలోని జేడీయూ కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు. పార్టీలో చేరిన సందర్భంగా సంజయ్ కుమార్ ఝా.. నిశాంత్‌కు పార్టీ టోపీ, జ్ఞాపికను అందించగా, కేంద్ర మంత్రి లలన్ సింగ్ సంప్రదాయ తలపాగా చుట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సీనియర్ నేతల కాళ్లకు నమస్కరించి నిశాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... తన తండ్రి మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. "ఈరోజు నేను పార్టీలో చేరడానికి వచ్చాను. మా నాన్న రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన నిర్ణయం. ఆయన సూచనల మేరకు బీహార్ కోసం మేం పనిచేస్తాం" అని పేర్కొన్నారు. నితీశ్ కుమార్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతానని చెప్పారు. కార్యకర్తలు పార్టీపై ఇదే ఉత్సాహం, నమ్మకం కొనసాగించాలని కోరారు. కాగా, నిశాంత్ కుమార్ త్వరలోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతారని జేడీయూ ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ తెలిపారు. చంపారన్ ప్రాంతం నుంచి ఆయన తన రాజకీయ యాత్రను ప్రారంభించే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం. గతంలో నితీశ్ కుమార్ కూడా తన రాజకీయ యాత్రలను అక్కడి నుంచే మొదలుపెట్టేవారు. రాబోయే రోజుల్లో పార్టీ సంస్థాగత బలోపేతంలో నిశాంత్ కీలక పాత్ర పోషిస్తారని, పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా చిత్తశుద్ధితో నిర్వహిస్తారని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి.

## నేపాల్ ఏకైక బిలియనీర్ ఓటమి

ఖాట్మండు: నేపాల్ పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడుతున్నాయి. దేశంలోని ఏకైక బిలియనీర్, ప్రముఖ పారిశ్రామికవేత్త బినోద్ చౌదరి ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలయ్యారు. నేపాలీ కాంగ్రెస్ పార్టీ తరఫున నవల్ పరాసి వెస్ట్-1 నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన.. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పీ) అభ్యర్థి బిక్రమ్ ఖనాల్ చేతిలో ఓడిపోయారు. నేపాల్ ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం, ఆర్ఎస్‌పీ అభ్యర్థి బిక్రమ్ ఖనాల్‌కు 45,241 ఓట్లు పోలవగా, బినోద్ చౌదరికి కేవలం 9,502 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో చౌదరి భారీ ఓట్ల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ప్రస్తుతం నేపాల్‌లో ఆర్ఎస్‌పీ ప్రభంజనం కొనసాగుతోంది. సంప్రదాయ రాజకీయ పార్టీలైన నేపాలీ కాంగ్రెస్, సీపీఎన్ (యూఎంఎల్) పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నేతలు ఓడిపోతున్నారు. నేపాలీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గగన్ థాపా, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ పౌడెల్ వంటి ఉద్ధండులు కూడా ఈ ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం ఆర్ఎస్‌పీ 103 స్థానాల్లో విజయం సాధించి, మరో 21 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మరోవైపు నేపాలీ కాంగ్రెస్ కేవలం 15 స్థానాల్లో గెలిచి, 2 స్థానాల్లో మాత్రమే ముందంజలో ఉంది. కాగా, బినోద్ చౌదరి గత దశాబ్ద కాలంగా ఫోర్బ్స్ జాబితాలో నేపాల్ ఏకైక బిలియనీర్‌గా కొనసాగుతున్నారు. 2026 మార్చి నాటికి ఆయన ఆస్తుల విలువ 2.1 బిలియన్ డాలర్లుగా ఉంది. సీజీ కార్ప్ గ్లోబల్ సంస్థకు అధిపతిగా ఉన్న చౌదరికి.. ప్రసిద్ధ 'వై వై' నూడిల్స్, నబిల్ బ్యాంక్, తాజ్ హోటల్స్ భాగస్వామ్యంతో నడిచే పలు లగ్జరీ హోటళ్ల వ్యాపారాలు ఉన్నాయి. గతంలో 2017, 2022 ఎన్నికల్లో ఎంపీగా ఎన్నికైన చౌదరి.. ఈసారి మాత్రం ఆర్ఎస్‌పీ ప్రభంజనంలో సీటు కోల్పోయారు.

## నౌకపై దాడికి ముందే అమెరికా హెచ్చరిక

న్యూఢిల్లీ: శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై దాడికి ముందు అమెరికా హెచ్చరికలు జారీ చేసిందా? అంటే అవుననే అంటున్నారు. గత నెలలో విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన ఇరాన్ యుద్ధ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా జలాంతర్గామి దాడి చేసి ముంచివేసింది. అయితే దాడికి ముందు నౌకలోని సిబ్బందిని అమెరికా హెచ్చరించినట్లు తెలుస్తోంది. వెంటనే నౌకను వదిలిపెట్టి వెళ్లాలని ఇరాన్ యుద్ధ నౌక కమాండర్‌ను రెండుసార్లు ఆదేశించినట్లు తెలుస్తోంది. జలాంతర్గామి దాడికి కొన్ని నిమిషాల ముందు నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. మార్చి 4న జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని, సిబ్బంది ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచన చేశారని తెలుస్తోంది. అయితే యుద్ధ నౌక కమాండర్ మాత్రం అందుకు ససేమీరా అన్నారు. దీనితో సిబ్బందిలోని కొంతమంది కమాండర్‌తో వాదనకు దిగినట్లు తెలుస్తోంది. కొంతమంది కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్ల ద్వారా ప్రాణాలతో బయటపడ్డారని తెలుస్తోంది. అమెరికా జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని తెలిపిన నౌక సిబ్బంది ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది.

# ఇరాన్ వల్లే స్కూల్ బాలికల మృతి



వాషింగ్టన్: ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై జరిగిన ఘోర బాంబు దాడిలో 160 మంది మరణించిన ఘటనపై అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ దాడితో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. శనివారం ఆయన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మయామికి వెళ్తున్న సమయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం, తాజా పరిణామాలపై ఆయన సుదీర్ఘంగా స్పందించారు. పాఠశాల దాడి గురించి విలేకరులు ప్రశ్నించగా ట్రంప్ ఆ ఆరోపణలను ఖండించారు. "నేను చూసిన సమాచారం, ఆధారాల ప్రకారం అది కచ్చితంగా ఇరాన్ చేసిన పనే. వారి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చాలా అస్థిరంగా ఉంటాయి. వాటికి లక్ష్యాన్ని ఛేదించే కచ్చితత్వం అస్సలు ఉండదు. గురి తప్పి వారి పాఠశాల మీదే పడి ఉండవచ్చు తప్ప, మేము స్కూల్ పిల్లలపై దాడులు చేయం. ఇది పూర్తిగా వారి తప్పిదమే," అని ట్రంప్ స్పష్టం చేశారు. యుద్ధం పురోగతిపై ట్రంప్ పూర్తి ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తాము యుద్ధంలో గొప్ప విజయాలు సాధిస్తున్నామని, ఇరాన్ అనే "దుష్ట సామ్రాజ్యాన్ని" దాదాపు నేలమట్టం చేశామని వ్యాఖ్యానించారు. "వారి నౌకాదళంలోని 44 ఓడలను, వైమానిక దళంలోని ప్రతి విమానాన్ని మేము ధ్వంసం చేశాం. వారి క్షిపణి తయారీ కేంద్రాలపై, డ్రోన్ల నిల్వలపై తీవ్ర దాడులు జరిపాం. ఫలితంగా ఇప్పుడు ఇరాన్ నుంచి వచ్చే దాడులు నామమాత్రంగా మారాయి. యుద్ధం మొదలైన మొదటి రెండు రోజులతో పోలిస్తే, ప్రస్తుతం వారు కేవలం 9 శాతం సామర్థ్యంతోనే పోరాడుతున్నారు. వారి దగ్గరున్న 70 శాతం లాంచర్లు నాశనమయ్యాయి. అవి చాలా ఖరీదైనవి, తిరిగి సమకూర్చుకోవడం వారికి చాలా కష్టం. వారి నాయకత్వం అంతా దాదాపు అంతమైంది," అని అమెరికా విజయాలను ట్రంప్ వివరించారు. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందన్న ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ, తాను కాలపరిమితిని అంచనా వేయనని, ఎంత సమయం పడితే అంత కాలం పోరాడుతామని చెప్పారు. ఇరాన్ సైన్యం దాదాపు తుడిచిపెట్టుకుపోయిందని, వారిపై మరింత తీవ్రంగా విరుచుకుపడాలా వద్దా అనేది ఇంకా నిర్ణయించలేదని అన్నారు. ఈ పర్యటనలో ట్రంప్ వెంట అమెరికా ప్రత్యేక ఎన్వాయ్ స్టీవ్ విట్‌కాఫ్ కూడా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ, దౌత్యపరమైన పరిష్కారం సాధ్యమేనని, అయితే అది పూర్తిగా ఇరాన్ చేతుల్లోనే ఉందన్నారు. "గత చర్చల్లో వారు సహకరించలేదు. తమకు యురేనియం శుద్ధి చేసే హక్కు ఉందని, 11 అణుబాంబులకు సరిపడా ఇంధనం తమ వద్ద ఉందని గొప్పలు చెప్పారు. యుద్ధంలో గెలవలేని దాన్ని, చర్చల ద్వారా సాధించలేమని వారికి స్పష్టం చేశాం. కాబట్టి వారి అహంకారం, ధోరణి మారాలి," అని విట్‌కాఫ్ అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, జోర్డాన్ వంటి దేశాలపై క్షిపణి దాడులు చేసింది. అయితే, ఇరాన్ సైనిక పాటవం ఇప్పుడు పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రపంచం నుంచి ఒక పెద్ద "క్యాన్సర్"ను తొలగిస్తున్నామని ట్రంప్ అభివర్ణించారు.

## విమానంలో బీడీ తాగాడు

### ఆకాశ ఎయిర్ విమానంలో నిర్వాకం

### నిందితుడి వద్ద లైటర్‌ను గుర్తింపు

న్యూఢిల్లీ: విమాన ప్రయాణాల్లో కఠినమైన భద్రతా నిబంధనలు ఉన్నప్పటికీ, కొందరు ప్రయాణికులు వాటిని అతిక్రమిస్తూనే ఉన్నారు. తాజాగా ఢిల్లీ నుంచి గోవా వెళుతున్న ఆకాశ ఎయిర్ విమానంలో ఓ ప్రయాణికుడు ఏకంగా టాయిలెట్‌లో బీడీ కాల్చి పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఘటన శనివారం జరగగా, దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు ఆదివారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీకి చెందిన ఆశీష్ అనే వ్యక్తి ఆకాశ ఎయిర్ విమానంలో ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా నిందితుడు టాయిలెట్‌లోకి వెళ్లి బీడీ కాల్చాడు. గమనించిన సిబ్బంది తనిఖీ చేయగా, అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే అతని వద్ద లైటర్ కూడా లభించింది. విమానంలో మండే స్వభావం ఉన్న వస్తువులను నిషేధించినా, అతడు లైటర్‌ను ఎలా తీసుకెళ్లాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. విమానంలోని లావెటరీలో ప్రయాణికుడు బీడీ కాల్చడం వల్ల తోటి ప్రయాణికులతో పాటు విమాన భద్రతకు, సిబ్బందికి కూడా తీవ్ర ఇబ్బంది కలిగిందని విమానయాన సంస్థ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు ఆధారంగా గోవాలోని మోపా ఎయిర్‌పోర్ట్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) మరియు పౌర విమానయాన భద్రత చట్టం కింద ఆశీష్‌పై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విమాన భద్రతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది.

## ఈ-పాన్ కార్డు డౌన్‌లోడ్ మెయిల్ ఫేక్

### పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం వివరణ

న్యూఢిల్లీ: ఈ-పాన్ కార్డును డౌన్ లోడ్ చేసుకోవాలని మీకు ఈ-మెయిల్ వచ్చిందా? ఇలాంటి మెయిల్స్ వస్తే అది సైబర్ నేరగాళ్ల పనిగా గ్రహించండి... "మీ ఇ-పాన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోండి" అని వస్తే అది ఫేక్ మెయిల్‌గా నిర్ధారించుకోవాలని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. ఇలాంటి మెయిల్స్ వస్తే వాటికి స్పందించకూడదని సూచించింది. లింకులు, కాల్స్, ఎస్సెమ్మెస్‌లు పంపించి ఆర్థిక వివరాలు, సున్నితమైన సమాచారం అడుగుతారని హెచ్చరించింది. అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఎప్పుడూ తప్పుడు సమాచారాన్ని విశ్వసించవద్దని పేర్కొంది. ఏదైనా సందేహం ఉంటే అధికారిక వెబ్‌సైట్‌ను ఆశ్రయించాలని పేర్కొంది. ఆదాయపు పన్ను శాఖ నుంచి అని వచ్చే మెయిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యుత్తరం ఇవ్వవద్దని, ఎలాంటి అటాచ్‌మెంట్‌లను తెరువవద్దని ఆదాయపు పన్ను శాఖ సూచించింది. ఫిషింగ్ వెబ్ సైట్‌లకు సంబంధించిన లింకులపై క్లిక్ చేసి బ్యాంకు ఖాతా, క్రెడిట్ కార్డు వివరాలు ఇవ్వవద్దని తెలిపింది.



## నాకు మీ అవసరం లేదు

### ఇది గుర్తు పెట్టుకుంటా

### బ్రిటన్ ప్రధానిపై ట్రంప్ ఫైర్

న్యూయార్క్: ఇరాన్‌తో యుద్ధం వేళ, బ్రిటన్ ప్రధానమంత్రి తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాకు విమాన వాహక నౌకలను పంపించే విషయంపై యూకే ప్రభుత్వం ఇంకా తేల్చుకోకపోవడంపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. యుద్ధం గెలిచిన తర్వాత తమతో కలిసే వ్యక్తులు అవసరం లేదని వ్యాఖ్యానించారు. యుద్ధంలో గెలిచాక మీ విమాన వాహక నౌకలను మోహరించాల్సిన అవసరం లేదని యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌పై మండిపడ్డారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా స్టార్మర్‌పై విమర్శలు గుప్పించారు. బ్రిటన్ రక్షణ మంత్రిత్వ శాఖ 'హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్' విమాన వాహన నౌకను సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది. రెండు విమాన వాహక నౌకలలో ఒకదానిని సిద్ధంగా ఉంచామని, అయితే పశ్చిమాసియాకు తరలించే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని బ్రిటన్‌కు చెందిన ఒక అధికారి మీడియాతో మాట్లాడుతు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందించారు. ఒకప్పుడు యూకే తమకు మిత్రదేశమని పేర్కొన్నారు. పశ్చిమాసియాకు రెండు విమాన వాహక నౌకలను తరలించే విషయంపై వారు తీవ్రంగా ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. అమెరికా బలగాలకు ఇప్పుడు వాటి అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ చర్యను తాము ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామని స్టార్మర్‌కు హెచ్చరిక జారీ చేశారు. ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా చేస్తున్న యుద్ధంలో తమ బలగాలు ప్రత్యక్షంగా పాల్గొనబోవని బ్రిటన్ ప్రధాని స్పష్టం చేశారు. అయితే తమ సైనిక స్థావరాలను ఆత్మరక్షణ కోసం ఉపయోగించుకునేందుకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు అనుమతిస్తున్నట్లు స్టార్మర్ వెల్లడించారు. స్టార్మర్ ఈ చర్యతో తాను సంతృప్తిగా లేనని ట్రంప్ అన్నారు.



## భారత్-చైనా దోస్తుల్లా ఉండాలి

### చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ

బీజింగ్: భారత్, చైనా దేశాలు ఒకరికొకరు ముప్పు అని భావించకుండా అభివృద్ధికి తోడ్పడే అవకాశంగా చూడాలని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ అన్నారు. ఈ రెండు దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని అన్నారు. వార్షిక మీడియా సమావేశంలో సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలను మెరుగుపరుచుకునే అంశంలో ఇరుదేశాలు కట్టుబడి ఉండాలని అన్నారు. పొరుగు దేశాలుగా, గ్లోబల్ సౌత్ సభ్యులుగా భారత్, చైనా దీర్ఘకాలిక సంబంధాలను కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. పరస్పర విశ్వాసం, సహకారం అనేవి రెండు దేశాల అభివృద్ధికి ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. విభజనవాదం, ఘర్షణలు అభివృద్ధిని దెబ్బతీస్తాయని సూచించారు. రెండేళ్ల క్రితం కజాన్ వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల సమావేశం అనంతరం భారత్, చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని అన్నారు. గత ఏడాది తియాంజిన్‌లో మోదీ, జిన్‌పింగ్ మరోసారి భేటీ అయ్యారని, ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపరిచాయని అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటివి ఇరుదేశాలకూ ప్రయోజనం చేకూర్చాయని అన్నారు. ఇరు దేశాలు సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వం కొనసాగాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన అన్నారు.

## బెంగాల్ గవర్నర్‌గా 12 సెంచరీలు చేశా: ఆనందబోస్

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా 1200 రోజులు సేవలందించానని, క్రికెట్ పరిభాషలో చెప్పాలంటే 12 సెంచరీలు చేశానని గవర్నర్ పదవికి రాజీనామా చేసిన ఆనందబోస్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన ఆకస్మికంగా రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. రాజీనామా వ్యవహారంపై ఆయన స్పందిస్తూ, అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. రాజీనామాకు గల కారణాలను సరైన సమయం వచ్చే వరకు గోప్యంగా ఉంటాయని అన్నారు. కోల్‌కతా విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు తిరిగి బెంగాల్‌కు వస్తానని తెలిపారు. ప్రవేశం ఉన్నచోట నిష్క్రమణ కూడా ఉంటుందని ఆసక్తికర వ్యాఖ్య చేశారు. 1200 రోజులు గవర్నర్‌గా సేవలు అందించడం తనకు చాలునని అన్నారు. నిష్క్రమించడానికి ఇది సరైన సమయమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎదురైన చేదుఘటనపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, రాష్ట్రపతి ఎంతో అనుభవజ్ఞురాలని, గౌరవప్రదమైన వ్యక్తి అన్నారు. ఆమె అలా మాట్లాడటానికి కారణాలు ఏమైనా ఉండవచ్చని అన్నారు. రాష్ట్రపతి చేసిన కామెంట్లపై తాను ఎలాంటి వ్యాఖ్య చేయబోనని అన్నారు. కేరళకు చెందిన ఆనందబోస్ తన రాజీనామాకు వారం రోజుల ముందు తన ఓటు హక్కును బెంగాల్‌కు మార్చుకున్నారని తెలుస్తోంది.


## ట్రంప్‌ను వదలం: అలీ లారిజాని

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి డాక్టర్ అలీ లారిజాని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఖమేనీపై జరిగిన దాడికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుడైన లారిజాని.. సోషల్ మీడియా వేదికగా అమెరికా తీరుపై నిప్పులు చెరిగారు. ఎక్స్ వేదికగా స్పందించిన లారిజాని.. ట్రంప్‌ను తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడుల్లో తమ నాయకుడితో పాటు అనేక మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని, ఇది సాధారణ విషయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అమెరికా తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. మరోవైపు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో అనేక మంది అమెరికా సైనికులను తాము బంధించి జైళ్లలో ఉంచామని లారిజాని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం ఆరుగురు సైనికులే చనిపోయారంటూ ట్రంప్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవానికి మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని ఆరోపించారు. భవిష్యత్తులో కల్పిత ప్రమాదాల పేరుతో ఈ మరణాలను అమెరికా బయటపెట్టే అవకాశం ఉందన్నారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బందీగా తీసుకెళ్లినట్లే, ఇరాన్‌లో కూడా యుద్ధాన్ని త్వరగా ముగించాలని అమెరికా భావించిందని, కానీ వారి ప్లాన్ బెడిసికొట్టిందని లారిజాని స్థానిక మీడియాతో పేర్కొన్నారు.

## లవ్లీ చిత్రం



నేహా శెట్టి



## ఇంటివాడు కాబోతున్న బెల్లంకొండ శ్రీనివాస్

కావ్య రెడ్డి అనే ఆమెతో ప్రేమలో ఉన్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఆదివారం నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సినిమా ఇండస్ట్రీ నుండి ప్రముఖ హీరోయిన్ సంయుక్త మీనన్ , డైరెక్టర్ శ్రీను వైట్ల వచ్చి సందడి చేశారు. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కావ్య రెడ్డిల నిశ్చితార్థానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. కావ్య రెడ్డి విషయానికి వస్తే .. ఈమెకు సినిమా ఇండస్ట్రీతో పరిచయం లేదు. కాకపోతే ఈమె తాతగారు జడ్జి కాగా ఈమె తండ్రి లాయర్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కుటుంబానికి కావ్య కుటుంబానికి మంచి పరిచయాలు ఉండడంతోనే.. ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి..ఆ పరిచయం కాస్త ప్రేమగా మారినట్లు సాయి శ్రీనివాస్ తెలిపారు. ఇకపోతే నిశ్చితార్థంతో ఒక్కటైన జంట ఈ ఏడాది ఆఖరిలో వివాహం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక కాబోయే నూతన జంటకు సినీ సెలెబ్రిటీలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## సల్మాన్ సరసన నయనతార



నయనతార సల్మాన్ ఖాన్ సరసన నటించే అవకాశాన్ని అందుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా వయసు పెరుగుతున్నా కూడా నయనతార క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు.. లేడీ సూపర్ స్టార్ అనే ట్యాగ్ కి తగ్గట్లుగానే స్టార్ హీరోల సినిమాలలో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతోంది. ఇక ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిన నయనతార ప్రతిభతో పాటు అదృష్టాన్ని కూడా మూటగట్టుకొని ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో సమానంగా దూసుకుపోతూ ఉండడం విశేషం. ఇక నయనతార ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ఒకవైపు స్టార్ హీరోల సినిమాలలో హీరోయిన్ గానే కాకుండా.. మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది. అందులో భాగంగానే గతంలో వచ్చిన మూకుత్తి అమ్మన్ సినిమాకి సీక్వెల్ గా వస్తున్న మూకుత్తి అమ్మన్ 2లో నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ స్టార్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో వరల్డ్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమాలో కూడా అవకాశం అందుకుంది.






## తెలంగాణలో ఉస్తాద్ గప్‌చుప్

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' ఉగాది కానుకగా మార్చి 19న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి ఫైనల్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, సంగీత దర్శకుడు థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌పై ఫోకస్ చేశారు. మరోవైపు, బాలీవుడ్ భారీ చిత్రం 'ధురంధర్: ది రివెంజ్' మార్చి 18 సాయంత్రం నుండే ప్రీమియర్ షోలతో బాక్సాఫీస్ వద్ద పోటీకి దిగుతోంది. టికెట్ ధరల విషయంలో చిత్ర యూనిట్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాకు తెలంగాణలో ఎలాంటి టికెట్ రేట్ల పెంపు ఉండకపోవచ్చు, కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రూ. 500 ధరతో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక జీవో త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

## 100 ఎకరాలున్నోడే నా మొగుడు

మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ వెరీ టాలెంటెడ్ నటి మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె 'ఈచట వాహనములు నిలపరాదు' అనే చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. ఆ తర్వాత ఈమె రవితేజ హీరోగా రూపొందిన 'ఖిలాడి'లో నటించింది. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా కొట్టినప్పటికీ ఇందులో మీనాక్షి తన అందాలను భారీ స్థాయిలో ఆరబోసింది. దానితో ఒక్కసారిగా ఈమెకు గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత వరుస పెట్టి మీనాక్షికి తెలుగులో అవకాశాలు దక్కుతున్నాయి. ఇప్పటివరకు ఈ నటి చాలా సినిమాల్లో నటించినా విజయాల సంఖ్య మాత్రం తక్కువగానే ఉంది. ఈమెకు నటిగా మంచి గుర్తింపును తీసుకువచ్చిన సినిమాలలో లక్కీ భాస్కర్ మొదటి స్థానంలో నిలుస్తుంది. ఆ తర్వాత ఈమెకు 'సంక్రాంతికి వస్తున్నాం', 'హిట్ ది సెకండ్ కేస్' సినిమాల ద్వారా మంచి గుర్తింపు లభించింది. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా ఈమె 'అనగనగా ఒక రాజు' అనే మూవీతో ప్రేక్షకులను పలకరించి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ తనకు కాబోయే భర్తకు ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి అనేది చెప్పుకొచ్చింది. మీనాక్షి మాట్లాడుతూ... "నాకు కాబోయే భర్తకు పెద్ద పెద్ద బిజినెస్లు ఉండాల్సిన అవసరం లేదు, కోట్లల్లో సంపాదించాల్సిన అవసరం లేదు. అతను వ్యవసాయం చేస్తే సరిపోతుంది, కానీ అతనికి 100 ఎకరాల భూమి ఉండాలి. వంట బాగా చేయాలి, బట్టలు ఉతకాలి, ఇంటి పనులన్నీ చూసుకోవాలి, ఇలాంటి క్వాలిటీస్ ఉన్న వ్యక్తి నాకు భర్తగా రావాలని ఈ బ్యూటీ కోరుకుంటోంది.



## శ్రీదేవి బాటలో జాన్వీ కపూర్






అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా వెండి తెరకు పరిచయం అయిన జాన్వీ కపూర్ తెలుగు పరిశ్రమలో టాప్ స్టార్లే టార్గెట్ గా అవకాశాలు అందుకుంటోంది. ఇప్పటికే తొలి చిత్రం దేవరలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కు జోడీగా నటించింది. ఈ సినిమా సెట్స్ లో ఉండగానే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన పెద్దిలో ఛాన్స్ అందుకుంది. మరోసారి దేవర2 లో ఎన్టీఆర్ సరసన కనిపించనుంది. ఇది పూర్తి చేయగల్గితే తారక్ కో రెండు సార్లు పనిచేసినట్లు అవుతుంది. మరి తదుపరి జాన్వీ నటించాల్సిన పాన్ ఇండియా హీరోలు ఎవరు అంటే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డార్లింగ్ ప్రభాస్. తెరపై బన్నీకి అమ్మడు పర్ఫెక్ట్ జోడీగా సెట్ అవుతుంది. కానీ ప్రభాస్ కటౌట్ ను మ్యాచ్ చేయడం అంత సులభం కాదు. అదంతా కెమెరా మెన్ మీద ఆధారపడి ఉంటుంది. వారణాసితో సూపర్ స్టార్ మహేష్ కూడా పాన్ ఇండియా మార్కెట్ లోకి అడుగు పెడుతున్నారు. జాన్వీ లిస్ట్ లో మహేష్ కూడా చేరుతాడు. దీంతో టైర్ వన్ లో పాన్ ఇండియా స్టార్లు పూర్తయినట్లే. అయితే జాన్వీ కపూర్ కోరుకుంటోన్న ఓ హీరో ఉన్నాడు. అతడే విజయ్ దేవరకొండ. అర్జున్ రెడ్డి సినిమాతో అమ్మడు విజయ్ కి అభిమానిగా మారిపోయింది. విజయ్‌తో నటించాలని ఈ బ్యూటీ ఉవ్విళ్లూరుతోంది.



## 'టార్టాయిస్'లో అమృత చౌదరి క్యూటీ లుక్

యంగ్ హీరో రాజ్ తరుణ్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ డిఫరెంట్ మూవీ 'టార్టాయిస్'. రిత్విక్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా.. ఈ చిత్రం నుండి హీరోయిన్ అమృత చౌదరికి సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాలో అమృత చౌదరి 'శృతి' అనే కీలకమైన పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఒక స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో అమృత గ్రీన్ కలర్ లంగా ఓణి ధరించి, చాలా పద్ధతిగా, ఒక అమాయకపు పల్లెటూరి అమ్మాయిలా మెరిసిపోతోంది. ఆమె కళ్లలో ఉన్న ఆ అమాయకత్వం నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ చూస్తుంటే, సినిమాలో ఆమె పాత్ర చాలా క్యూట్‌గా, నేచురల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది.

## వేగం తగ్గిన రకుల్



స్పైడర్ రిలీజ్ ముందు వరకూ రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ లో ఎంత బిజీగా ఉండేదో చెప్పాల్సిన పనిలేదు. వరుసగా స్టార్ హీరోల సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడిపేది. జయాపజయాలతో సంబంధం లేకుండా అమ్మడు తెలుగు అవకాశాలు అందుకుంది. కానీ స్పైడర్ రిలీజ్ అనంతరం సీన్ మారింది. అప్పటి నుంచి అవకాశాలు తగ్గాయి. బాలీవుడ్ లో రీలాంచ్ అయిన తర్వాత మాత్రం తెలుగు సినిమాల్ని లైట్ తీసుకుంది. ఆ సమయంలో వచ్చిన టాలీవుడ్ అవకాశాలు కూడా కాదంది. తాజాగా బాలీవుడ్‌లోనూ వేగం బాగా తగ్గింది. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో ఒకే ఒక్క ప్రాజెక్ట్ ఉంది. పతి పత్నీ ఔర్ వో 2 లో నటిస్తోంది. ఈ సినిమా మినహా కొత్త ప్రాజెక్టులు వేటికి అమ్మడు సైన్ చేసింది

## షీ ఇండియా మ్యాగజైన్‌పై నభా నటేష్

హీరోయిన్ నభా నటేష్ అరుదైన గౌరవం దక్కింది. షీ ఇండియా అనే మ్యాగజైన్ కవర్ పేజ్.. బ్లాక్ అవుట్ ఫిట్ లో బాక్సింగ్ లుక్ లో ఉన్న నభా నటేష్ ఫోటోని తన కవర్ పేజ్ పై షేర్ చేస్తూ నభా నటేష్ అన్ స్టాపబుల్ అంటూ ఆమెకు స్పెషల్ విషెస్ తెలియజేసింది. ముఖ్యంగా ప్రపంచాన్నే ఇన్స్పైర్ చేస్తున్న ప్రతి ఒక్క మహిళకి ఉమెన్స్ డే శుభాకాంక్షలు అంటూ తన కవర్ పేజీపై నభా నటేష్ ఫోటోని షేర్ చేసింది షీ ఇండియా. ప్రస్తుతం ఈ ఫోటో అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది.





# ధనాధన్..

**పొట్టి కప్ విజేతగా టీమిండియా**

# తీన్ ధమాకా

## ముచ్చటగా మూడో కప్ గెలుపు.. సూర్య సేన ఆల్ రౌండ్ ప్రతిభ

### ఫైనల్‌లో కివీస్‌పై భారీ విజయం.. రాణించిన అభిషేక్, సంజూ, ఇషాన్, బుమ్రా, అక్షర్



చాంపియన్స్.. టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు. ఈ గెలుపు జట్టు అద్భుతమైన నైపుణ్యాలు, దృఢ సంకల్పం, టీమ్ వర్క్‌కు నిదర్శనం

- ప్రధాని మోదీ

చాంపియన్స్! అహ్మదాబాద్‌లో టీమిండియాకు ఇది అద్భుత విజయం. టోర్నమెంట్ ఆసాంతం మనవాళ్ళు ఎక్స్‌ప్లోజివ్ క్రికెట్ ఆడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ పోరాడి మళ్లీ వరల్డ్ చాంపియన్లుగా నిలిచిన తీరు అద్భుతం

- విరాట్ కోహ్లి

టీ20 ఫార్మాట్‌లో వరుసగా రెండుసార్లు కప్పు గెలిచిన ఘనత భారత్‌కే దక్కుతుంది. కివీస్ బౌలర్లతో పోలిస్తే మన బౌలర్లు స్లోయర్, షార్ట్ పిచ్ బంతులను తెలివిగా విసిరారు. ఇక్కడి బౌండరీ కొలతలకు తగ్గట్టుగా లెంగ్త్స్ మార్చడం వల్లే విజయం సాధ్యమైంది

- సచిన్ టెండూల్కర్

### శాంసన్, అభిషేక్ ఊచకోత

ఫైనల్లో భారత టాపార్డర్ ఊచకోతకు న్యూజిలాండ్ బౌలర్లు బలైపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(52) ఫామ్ అందుకుంటూ అర్ధ శతకం బాదేయగా.. హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో సంజూ శాంసన్(89) చెలరేగిపోయాడు. వీరిద్దరి మెరుపులతో కుదేలైన కివీస్ బౌలర్లను ఇషాన్ కిషన్(54) తుఫాన్ ఇన్నింగ్స్‌తో భయపెట్టాడు. జేమ్స్ నీషమ్(3-46) ఒకే ఓవర్లో మూడు వికెట్లతో కాస్త స్కోర్ తగ్గినా.. ఆఖర్లో శివం దూబే(26 నాటౌట్) మెరుపులతో భారత్ నిర్ణీత ఓవర్లలో 255 పరుగులతో కివీస్‌కు రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది.

అభిషేక్ ఒక సిక్స్.. సంజూ ఒక సిక్స్.. అభిషేక్ ఒక ఫోర్.. సంజూ ఒక ఫోర్.. అభిషేక్ రెండు సిక్సులు.. సంజూ రెండు సిక్సులు.. మీరేనా? నేనేం తక్కువా అని ఇ'షాన్'దార్ బ్యాటింగ్.. నా విలువేంటో చూపిస్తానని శివాలెత్తిన శివం దుబే.. అక్షర్ పటేల్ వికెట్ల వేట.. బుమ్రా బూమ్ బూమ్ బౌలింగ్.. పవర్ హౌజ్ ఫీల్డింగ్.. ఇలా అన్ని రంగాల్లో పైచేయి సాధించి కప్పు చేతబట్టింది.. డిఫెండింగ్ చాంపియన్. ముువ్వన్నెల జెండా మెరిసేలా, యావత్ భారతావని మురిసేలా.. అభిమాన లోకం గర్వించేలా.. వరుసగా రెండో కప్‌ను కైవసం చేసుకుంది టీమిండియా.

(ఈవార్తలు - క్రీడావాణి)

డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు చరిత్ర సృష్టించింది. స్వదేశంలో సంపూర్ణ ఆధిపత్యంతో రికార్డు స్థాయిలో మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను కొల్లగొట్టింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో అసలైన ఆటతో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించింది టీమిండియా. ఓపెనర్లు సంజూ శాంసన్(89), అభిషేక్ శర్మ(52), ఇషాన్ కిషన్(54)ల మెరుపులతో ప్రత్యర్థిని సగం దెబ్బతీసిన సూర్యకుమార్ యాదవ్ సేన.. బుమ్రా(4-15), అక్షర్ పటేల్(3-27) సంచలన బౌలింగ్‌తో పడగొట్టింది. పరుగు విజయంతో పొట్టి కప్‌లో మరే ఆతిథ్య జట్టుకు సాధ్యపడని విధంగా ప్రపంచకప్‌ను పట్టేసింది. ఈ విక్టరీతో కివీస్ ఫోబియాను.. నరేంద్ర మోడీ స్టేడియంలో ఫైనల్ భయాన్ని భారత్ అధిగమించింది. స్వదేశంలో టీ20 ప్రపంచకప్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టిన భారత్ ఛాంపియన్‌గా మురిసిపోయింది. లీగ్ దశను అజేయంగా ముగించి.. సూపర్ 8 తొలి మ్యాచ్‌లోనే దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా అద్భుతంగా పుంజుకుంది. సంజూ శాంసన్(89) మెరుపులతో సెమీస్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన సూర్యకుమార్ యాదవ్ సేన ఫైనల్లోనూ పంజా విసిరింది. 255 పరుగులతో న్యూజిలాండ్‌ను భయపెట్టిన భారత జట్టు.. బౌలింగ్‌లోనూ ఇరగదీసింది. బుమ్రా(4-15), అక్షర్ పటేల్() విజృంభణతో ఆరంభం నుంచి వికెట్లు కోల్పోయిన కివీస్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. అభిషేక్ శర్మ ఓవర్లో చివరి వికెట్‌గా వెనుదిరగగా.. టీమిండియా మూడోసారి టీ20 ఛాంపియన్‌గా నిలిచింది.




### ధోనీ, రోహిత్ లకు విశిష్ట గౌరవం

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరుగుతున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు ముందు అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. భారత క్రికెట్ దిగ్గజాలు ఎంఎస్ ధోని, రోహిత్ శర్మ కలిసి మెరిసిపోతున్న వరల్డ్ కప్ ట్రోఫీని మైదానంలోకి తీసుకువచ్చారు. 2007లో ధోని, 2024లో రోహిత్ భారత్‌కు కప్పు అందించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరు ఛాంపియన్ కెప్టెన్లు కప్పుతో రాగానే స్టేడియం మొత్తం ప్రేక్షకుల కేరింతలతో దద్దరిల్లింది. ఐసీసీ ఛైర్మన్ జే షా, జియోస్టార్ వైస్ ఛైర్మన్ ఉదయ్ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### అక్షర్ మ్యాజిక్



ప్రపంచకప్ ఫైనల్లో భారత్ నిర్దేశించిన రికార్డు ఛేదనలోన్యూజిలాండ్ తడబమడింది. పవర్ ప్లేలోనే బంతి అందుకున్న అక్షర్ పటేల్(2-18) తొ ఓవర్లోనే డేంజరస్ ఫిన్ అలెన్(9)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాతి ఓవర్లో.. సిక్సర్ బాదిన గ్లెన్ ఫిలిఫ్స్(5)ను క్లీన్‌బౌల్డ్ చేసి కివీస్‌కు మరో షాకిచ్చాడీ ఆల్‌రౌండర్. అంతకుముందు ఓవర్లో బుమ్రా ఫైనల్ లెగ్ దిశలో బంతిని గాల్లోకి లేపిన రచిన్ రవీంద్ర(1)ను ఇషాన్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు. పవర్ ప్లేలోనే మూడు బిగ్ వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను ఓపెనర్ టిమ్ సీఫర్ట్(52), మార్క్ చాప్‌మన్(3)లు ఆదుకోవాలనుకున్నా సాధ్యపడలే. వరుణ్ చక్రవర్తి ఓవర్లో సీఫర్ట్‌ను ఇషాన్ బౌండరీ క్యాచ్‌తో డగౌట్ చేర్చగా.. పాండ్యా ఓవర్లో బంతిని వికెట్ల మీదకు ఆడుకున్న చాప్‌మన్ వెనుదిరిగాడు. అంతే.. 72కే సగం వికెట్లు పడడంతో కివీస్ ఓటమి అంచున నిలిచింది. ఆ దశలో కెప్టెన్ మిచెల్ శాంట్నర్(43), డారిల్ మిచెల్(17 ) పరుగుల అంతరం తగ్గించేందుకు పోరాడారు. జేమ్స్ నీషమ్(8)ను స్లో యార్కర్‌తో బుమ్రా బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే మ్యాట్ హెన్రీ(0)ని బౌల్డ్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ.. ఫెర్గూసన్ సింగిల్ తీశాడు. కాసేపటికే అభిషేక్ ఓవర్లో జాకబ్ డఫ్ఫీ చివరి వికెట్‌గా వెనుదిరగడంతో 96 పరుగుల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసింది.



### ముగింపు వేడుకల్లో గందరగోళం

**రికీ మార్టిన్ ప్రదర్శనలో ఆడియో ఇబ్బంది**

అహ్మదాబాద్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ ముగింపు వేడుకలో తీవ్రమైన సాంకేతిక లోపం చోటుచేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత పాప్ స్టార్ రికీ మార్టిన్ ప్రదర్శనను అధికారిక బ్రాడ్‌కాస్టర్లు ప్రసారం చేసిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆడియో నాణ్యత అత్యంత దారుణంగా ఉండటంతో టీవీ, డిజిటల్ మాధ్యమాల్లో వీక్షించిన కోట్లాది మంది అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన ఫైనల్ అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు వేడుకలో రికీ మార్టిన్ తన ఎనర్జిటిక్ ప్రదర్శనతో అలరించారు. అయితే, స్టార్ స్పోర్ట్స్, జియోస్టార్ వంటి అధికారిక బ్రాడ్‌కాస్టర్ల ఫీడ్‌లో ఆయన గొంతు అస్పష్టంగా, సంగీతం సింక్‌లో లేకుండా వినిపించింది. స్టేడియంలో ప్రత్యక్షంగా చూసిన వారికి ఆడియో అనుభవం అద్భుతంగా ఉన్నప్పటికీ, బ్రాడ్‌కాస్ట్ సౌండ్ మిక్సింగ్‌లో వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో, ముఖ్యంగా 'ఎక్స్'లో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఈవెంట్‌లో ఇంతటి అన్‌ప్రొఫెషనల్ వైఖరి ఏంటని బ్రాడ్‌కాస్టర్లను నిలదీస్తున్నారు. ఇది 'పెద్ద అవమానం' అంటూ బీసీసీఐ, ఐసీసీలను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీ ఫైనల్ వేడుకలో రిక్కీ మార్టిన్‌తో పాటు సుఖబీర్, ఫల్గుణి పాఠక్ కూడా ప్రదర్శన ఇచ్చారు.

### అమ్మాయిలు ఘోర ఓటమి

**ఆసీస్‌తో ఏకైక పింక్ బాల్ టెస్టు**

**ఆసీస్ చేతిలో 10 వికెట్ల తేడాతో ఓటమి**

పెర్త్ లోని వాకా (డబ్ల్యూఏసీఏ) మైదానం వేదికగా జరిగిన ఏకైక పింక్ బాల్ టెస్టులో భారత మహిళల జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆదివారం మూడో రోజు ఆటలో ఆస్ట్రేలియా జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో దిగ్గజ ప్లేయర్ అలిస్సా హీలీకి ఆస్ట్రేలియా ఘనంగా వీడ్కోలు పలికినట్లయింది. హీలీకి బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినప్పటికీ, ఆమె విజయంతో తన అంతర్జాతీయ కెరీర్‌ను ముగించింది. తాజా టెస్టు విజయంతో మల్టీ ఫార్మాట్ సిరీస్‌ను ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. భారత్ ఈ పర్యటనను టి20 సిరీస్ విజయంతో (2-1) ఘనంగా ఆరంభించినప్పటికీ, ఆ తర్వాత ఆసీస్ పుంజుకుంది. వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన ఆతిథ్య జట్టు, టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంది.

### ప్రియురాలితో క్రికెటర్ పృథ్వీ షా నిశ్చితార్థం



టీమిండియా యువ క్రికెటర్ పృథ్వీ షా తన జీవితంలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. తన ప్రియురాలు, నటి ఆకృతి అగర్వాల్‌తో ఆదివారం అతని నిశ్చితార్థం జరిగింది. ఈ సంతోషకరమైన విషయాన్ని పృథ్వీ షా స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ, కొన్ని రొమాంటిక్ ఫొటోలను పంచుకున్నాడు. ఈ ఫొటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. షా పోస్ట్ చేసిన చిత్రాలలో, అతను మోకాళ్లపై కూర్చుని ఆకృతికి ఉంగరం తొడుగుతూ ప్రపోజ్ చేయడం కనిపించింది. మరో ఫొటోలో ఇద్దరూ తమ ఎంగేజ్‌మెంట్ రింగ్స్‌ను చూపిస్తూ ఆనందంగా పోజులిచ్చారు. "మైదానంలో సిక్సర్ల నుంచి జీవితాంతం హిట్స్ వరకు. తనే నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్" అంటూ షా తన పోస్ట్‌కు క్యాప్షన్ జోడించాడు. ఈ పోస్ట్‌పై అభిమానులు, సహచర క్రికెటర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఐపీఎల్ 2026లో షా ప్రాతినిధ్యం వహించనున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ కూడా అతనికి అభినందనలు తెలియజేసింది. లక్నోకు చెందిన ఆకృతి అగర్వాల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటిగా గుర్తింపు తెచ్చుకుంది. 'త్రిముఖ' అనే కన్నడ చిత్రంతో ఆమె వెండితెరకు పరిచయమైంది. ఇటీవల ముంబైలో జరిగిన అర్జున్ టెండూల్కర్ వివాహ వేడుకలో ఈ జంట కలిసి సందడి చేసింది.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 9-3-2026

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# ఆహారం.. విషం

ప్రజల ప్రాథమిక అవసరాలైన తిండి, నీరు, పాలు విషతుల్యమవుతుంటే వ్యవస్థ ఎటు వెళ్తోందనే ప్రశ్న ఉదయిస్తోంది. ఒకవైపు తెలంగాణలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలు ఫుడ్ పాయిజన్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుండగా, మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ పాలు నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. లాభార్జనే ధ్యేయంగా సాగుతున్న వ్యాపార కోణం, ప్రభుత్వాల పర్యవేక్షణా లోపం సామాన్యుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించాయి. తెలంగాణలోని సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాల్లో 2024 నుంచి ఇప్పటివరకు వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఒక్క 2024లోనే సుమారు 423 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ బారిన పడగా, గడిచిన కొద్ది నెలల్లో గద్వాల, బెల్లంపల్లి, ములుగు వంటి ప్రాంతాల్లో కూడా ఇవే ఘటనలు పునరావృతమయ్యాయి. దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సైతం సీరియస్ అయ్యింది. నాసిరకం వస్తువుల సరఫరా, వంటశాలల్లో అపరిశుభ్రత, పర్యవేక్షణ లోపం పసి ప్రాణాలతో చెలగాటమాడుత ఎన్నాయి. అటు.. ఏపీలోని రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన కల్తీ పాల ఘటన కలకలం రేపింది. ఈ పాలు తాగడం వల్ల ఇథలీన్ గ్లైకాల్ వంటి విషపూరిత రసాయనాల కారణంగా సుమారు 10 మంది మరణించగా, మరికొందరు కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆసుపత్రి పాలయ్యారు. లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న కల్తీ రాయుళ్ల ఆగడాలు మితిమీరుతు న్నాయి. ఘటన జరిగినప్పుడు హడావుడి చేసి, ఆ తర్వాత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించే పద్ధతి మారాలి. కేవలం ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించడమే పరిష్కారం కాదు. ఆహార భద్రత విభాగం పటిష్టంగా పనిచేయాలి. గురుకులాల్లో నిరంతర తనిఖీలు, పాలు–ఆహార పదార్థాల సరఫరాలో కఠిన ప్రమాణాలు పాటిస్తేనే సామాన్యుల ప్రాణాలకు రక్షణ ఉంటుంది. ప్రభుత్వాల బాధ్యత కేవలం పథకాలు ఇవ్వడమే కాదు, ప్రజల ప్రాణాలను కాపాడటం కూడా.

# గుప్త మహాదేవుడు

కైలాసం నుంచి శివుడు పారిపోయాడు.
ఎక్కడికి వెళ్లాడు.. ఎక్కడున్నాడు?
పార్వతీదేవి ఆందోళన చెందుతోంది.
ముక్కోటి దేవతలు సర్వలోకాలూ
వెతుకుతున్నారు.
శంకరుడు ఎక్కడ?

తెల్లవారుజాము.. బ్రహ్మముహూర్తం. పరమేశ్వరుడు ధ్యానం ముగించుకుని వచ్చి ఋషిమునులకు, భక్తకోటికి సతీసమేతంగా దర్శనమిచ్చాడు.. ఓ పక్క విఘ్నాధిపతి వినాయకుడు, మరో పక్క షణ్ముఖుడు కూచున్నారు.. ఎదురుగా శివపురాణ గానం సాగుతోంది.. రతీమన్మథులు ఆనందనృత్యం చేస్తున్నారు.. అంతా హ్యాపీగా సాగుతోంది.. ఇంతలోనే భూలోకం నుంచి సన్నగా పంచాక్షరీ శబ్దం ప్రతిధ్వనించింది.. అంతలోనే కైలాసాన్ని కదిపేంతగా.. కుదిపేంతగా ధ్వనితరంగాలు వినిపిస్తున్నాయి. ఒకసారి కైలాసాన్ని ఎత్తిన రావణుడి ఎక్స్పీరియన్స్ ఉంది కాబట్టి.. శివుడు ఆలస్యం చేయకుండా వెంటనే బయలు దేరాడు..... అప్పటికీ, ఎందుకో పార్వతీదేవి శంకించింది.. నేనూ రానా అని అడిగింది.. శివుడు వింతగా చూసి ఇప్పుడే వస్తాగా అని వెళ్లిపోయాడు.. మళ్లీ రాలేదు.. రోజులు గడుస్తున్నాయి కానీ శివుడి జాడ మాత్రం లేదు. ఇంతకీ ఎక్కడికి వెళ్లినట్లు..?



శివుడు కైలాసం వదిలి ఎక్కడికి వెళ్లినట్లు? ఎవరికీ అర్థం కాలేదు.. క్షణాల్లో ముల్లోకాలకూ ఈ విషయం దేవతల ఫోర్త్ ఎస్టేట్ అయిన నారదుడి ద్వారా పాకిపోయింది. అంతా ఆయన్ను వెతకటానికి బయలుదేరారు.. 14 లోకాలూ కలియదిరిగారు.. చివరకు అంతా కలిసి ఆపద్బాంధవుడు విష్ణువు దగ్గరకు వెళ్లారు. ఆయన తన సూపర్ నేచురల్ విజన్ అదేనండీ దివ్యదృష్టితోని అంతా ఒక్కసారి రివైండ్ చేసి చూశాడు.. ఆశ్చర్యపోయాడు.. అవాక్కయ్యాడు.. అందరితో చెప్పాడు.. పరమేశ్వరుడు ఎక్కడికో పరుగులు తీస్తున్నాడని.. ఏం జరిగింది..? పరమేశ్వరుడు... లయకారుడు.. ప్రళయకారుడు.. తన త్రినేత్రం తెరిచి సమస్త విశ్వాన్ని భస్మీపటలం చేయగల మృత్యుంజయుడైన ఈశ్వరుడు పారిపోవటం ఏమిటి? ఎందుకు పారిపోతున్నాడు? పరమేష్టి, మహావిష్ణువులచే పూజలందుకున్న మహాదేవుడు ఎందుకిలా చేస్తున్నాడు? ఎక్కడికి వెళ్తున్నాడు? ఆయన్ను అంతగా భయపెడుతున్నదెవరు? శివుడు లేని కైలాసాన్ని ఊహించగలమా? అమ్మ భవానీని ఇప్పుడు ఓదార్చేదెవరు? ముక్కోటి దేవతలకూ శివుడు కానరావటం లేదు. సమస్త గణాలు.. కార్తికేయుడు.. వినాయకుడు.. అంతా వెతుకుతున్నారు. ఎవరి శక్తికీ అంతుపట్టని చోట.. ఎవరికీ కానరాని చోట మహాశివుడున్నాడు.. దేవదేవుడు ఎక్కడ దాక్కున్నాడు? ఆయన్ను కనిపెట్టేదెలా? తిరిగి కైలాసానికి తెచ్చేదెలా? ముల్లోకాలు వణికిపోతున్నాయి. ఏం జరిగిందో అర్థం కావటం లేదు. దావానలంలా వార్త పాకిపోయింది. ఈశ్వరుడు కైలాసంలో లేడని.. ఎక్కడికి వెళ్లాడో తెలియడం లేదు.. మూడు కోట్ల మంది దేవతలు.. యక్ష, రాక్షస, గరుడ, గంధర్వ, కిన్నెర కింపురుషులంతా వెతుకుతున్నారు.. కానీ, ఆయన ఎక్కడున్నాడో తెలియటం లేదు.. చివరకు సాక్షాత్తూ మహా విష్ణువే రంగంలోకి దిగాల్సి వచ్చింది.. ఆ మహాదేవుడిని తిరిగి ఇంటికి తీసుకువచ్చే బాధ్యతను ఆయన నెత్తినెత్తుకున్నాడు.

విష్ణువు అన్వేషణ పైనున్న సత్యలోకం నుంచి కింద ఉన్న పాతాళం దాకా సాగింది.. ఎక్కడా శివుడి జాడ కానరాలేదు.. తన దివ్యదృష్టికి కూడా అంతుపట్టని చోట ఎక్కడున్నాడని నారాయణుడు తెగ ఆలోచిస్తున్నాడు.. అటూ.. ఇటూ.. విశ్వంలో అన్ని వైపులా చూస్తున్నాడు.. ఇంతలో ఒక చోటి నుంచి సన్నని వెలుగు రేఖ కైలాసంవైపు ప్రసరిస్తూ కనిపించింది. పైలోకాలకు, కింది లోకాలకు మధ్యనున్న భూలోకంనుంచి ఆ వెలుతురు వస్తోంది. విష్ణుమూర్తి ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా అక్కడికి బయలు దేరాడు.. భూమ్మీద.. భారత దేశంలో వింధ్య పర్వతాలకు కింది వైపున, కర్ణాటక రాష్ట్రంలోని ఒకానొక పెద్ద కొండ గుహలోంచి ఆ వెలుతురు వస్తోంది. అందులోకి సూక్ష్మరూపంలో శ్రీమహావిష్ణువు ప్రవేశించాడు.. ఆ గుహలో పరమేశ్వరుడు తపోధ్యాన ముద్రలో స్వామికి కనిపించాడు.. ఇంత గుప్తంగా ఇక్కడ దాక్కోవటమేమిటో ఆయనకు అర్థం కాలేదు. సందేహం తీర్చమని శివుడినే అడిగాడు.. కైలాసంలో శివుడు నృత్యగానాలతో ఉన్నప్పుడు ఆయనకు వినిపించింది భస్మాసురుడనే రాక్షసుడి తపో మంత్రం. అతని తపస్సుకు మెచ్చి వరం ఇవ్వటానికి శివుడు కైలాసం నుంచి దిగివచ్చాడు. కైలాస పర్వతానికి సమీపంలోనే తీర్థపురి అనే పర్వతం ఉంది.. ఈ పర్వతంపైనే భస్మాసురుడు పరమేశ్వరుడి కోసం ఘోరంగా తపస్సు చేశాడు.

సరే.. తపస్సు చేశాడు కదా.. వరమిద్దామని ఉదారంగా వచ్చిన బోళా శంకరుడికి భస్మాసురుడు గట్టి ఫిటింగే పెట్టాడు.. తన చెయ్యి ఎవరి తలపై పెడితే వాళ్లు క్షణంలో బూడిద కావాలని వరం కోరుకున్నాడు.. ఈ బోళా దేవుడికి కరుణాకటాక్షాలు ఎక్కువ కావటంతో అడిగిందే తడవుగా వరం ఇచ్చాడు. కానీ, ఆ రక్కసికి పెద్ద అనుమానం వచ్చింది. ఈ వరం ఎలా పనిచేస్తుందని.. వస్తువు కొన్నప్పుడు టెస్ట్ చేసి ఎలా తీసుకుంటామో.. వరం పొందినప్పుడు దాన్ని టెస్ట్ చేయాలన్న కొత్త ట్రెడిషన్ను భస్మాసురుడే స్టార్ట్ చేశాడు. వరం ఎవరిమీద టెస్ట్ చేయాలి? ఇచ్చిన వారిపైనే చేస్తే పోలా.. అందుకే శివుడిపైనే టెస్టుకు సిద్ధపడ్డాడు.. దాంతో అంతటి పరమేశ్వరుడు తీర్థపురి నుంచి కింద ఉన్న కన్నడ దేశం దాకా పరిగెత్తి పరిగెత్తి గుహలో దాక్కోవలసి వచ్చింది. ఇప్పుడు పరమేశ్వరుడిని కాపాడే బాధ్యతను విష్ణువు స్వీకరించాల్సి వచ్చింది. ఈశ్వరుని వెతుకుతూ.. వెతుకుతూ.. భస్మాసురుడు ఆ గుహ దగ్గరకు రానే వచ్చాడు. ఇంతకీ ఆ గుహ ఎక్కడుంది..? ఇప్పటికీ దాని జాడలున్నాయా? అక్కడ ఏం జరిగింది?.. విష్ణుమూర్తి ఏం చేశాడు..? శివుణ్ణి చూసిన తరువాత భస్మాసురుడి భరతం పట్టడానికి నారాయణుడు మోహినీ అవతారం దాల్చాల్సి వచ్చింది. ప్రపంచంలోనే అతి సౌందర్యరాశిగా మోహినిని చూసిన భస్మాసురుడు అసలు విషయాన్ని పూర్తిగా మరచిపోయి.. ఆమె వెంట పడటం మొదలు పెట్టాడు. తనను పెళ్లి చేసుకోమన్నాడు.. ఆమె అతనికి సవాలు విసిరింది.. తనతో సమానంగా డాన్స్ చేస్తే అప్పుడు ఆలోచిస్తానంది.. డాన్స్‌లోనే అతని చేయి అతని తలపైనే ఉంచుకునేలా చేసి అసురుని అంతం చేసింది. ఇదీ కర్ణాటకలోని ఆ



పర్వత గుహ వెనుక దాగిన కథ. ఈ గుహ సాదాసీదా గుహ కాదు. భారత దేశానికి పశ్చిమ కనుమల్లో పవిత్ర సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్యలో అనూహ్యమైన.. ఎవరూ ఊహించని.. గొప్ప గొప్ప జియాలజిస్టులకు సైతం అంతుపట్టని విధంగా ఏర్పడ్డ రాతి నిర్మాణం ఈ గుహ. చుట్టూ దట్టమైన అడవి.. చాలా దూరం నడిస్తే తప్ప గుహ దగ్గరకు చేరుకోవటం కష్టం. సాక్షాత్తూ ఈశ్వరుడు తానే సృష్టించుకుని ఈ గుహలో ఉన్నాడని చెప్తారు. రెండు అతి ఎత్తైన రాతి నిర్మాణాల నడుమ లోతైన గుహ ఏర్పడింది. ఈ రెండు రాతి శిఖరాలకు కూడా ఆధ్యాత్మికమైన పేర్లే ఉన్నాయి. ఒకటి భైరవ శిఖరమైతే.. మరొకటి మోహినీ శిఖరం.. భైరవ శిఖరం ఎత్తు దాదాపు 120 మీటర్ల వరకు ఉంటుంది. ఈ శిఖరం కిందనున్న గుహలో స్వయంభువుగా వెలసిన శివలింగం ఉంది.. ఈ శివలింగంపై శిఖరం నుంచి నిరాఘాటంగా పవిత్ర జల అభిషేకం చేస్తూ ఉంటుంది. కఠిన గండశిలగా కనిపించే ఈ లైమ్ స్టోన్ ఫార్మేషన్కు ఎలాంటి ఆధారం మాత్రం లేదు. ఈ రాతి శిఖరాలలో అత్యంత ఖరీదైన మాంగనీస్, లైమ్ స్టోన్, ఐరన్ ఓర్ లాంటి ఖనిజాలు ఉన్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్టులు చెప్పగలిగారు. ఇంతకు మించి ఈ రాతి శిఖరాలు ఎప్పుడు ఏర్పడ్డాయి? ఎలా ఏర్పడ్డాయి? అన్నదానికి వారి దగ్గర ఎలాంటి సమాచారం లేదు. మన దేశంలోని స్పిరిచ్యువల్ వండర్స్లో యానా కేవ్స్ ఒకటి. మహాదేవుడి ఉనికిని స్పష్టంగా చాటుతున్న అద్భుతం ఇది. దేవుడి అస్తిత్వాన్ని నమ్మని వాళ్లకు కూడా ఆశ్చర్యాన్ని, విస్మయాన్ని గొలిపే విశేషమిది. ఇది కేవలం శివుడి క్షేత్రమే కాదు. హరిహరులు ఇద్దరూ కొలువైన పరమాద్భుతం.

భైరవేశ్వర శిఖరం పక్కనే మోహినీ శిఖరం ఉంటుంది. న్యూయార్క్లో కూలిపోయిన వరల్డ్ ట్రేడ్ సెంటర్ల మాదిరిగానే ఇవి రెండు శిఖరాలు జంట శిఖరాలు. భైరవ శిఖరానికి కాస్త తక్కువ ఎత్తులో, అంటే సుమారు 90 మీటర్ల ఎత్తులో ఈ శిఖరం ఉంటుంది. ఈ మోహినీ శిఖరంపై అమ్మవారి విగ్రహం ఉంటుంది. ఈ అమ్మవారు పార్వతీదేవిగా కొలుస్తారు. భస్మాసుర వధ తరువాత మోహినీరూపంలో విష్ణువు స్వయంగా కైలాసానికి వెళ్లి ఉమాదేవిని ఈ గుహల దగ్గరకు తీసుకుని వచ్చాడట. అందుకే ఇక్కడ ఆమె కొలువై కనిపిస్తుంది. భైరవేశ్వర శిఖరం నుంచి లోపల ఉన్న శివలింగంపై పడే నీటికి ఎక్కడ లేని పవిత్రత ఉంది. శివుడి విభూతి ఎంత పవిత్రమైందో.. ఇక్కడ శిఖరంపై నుంచి నేరుగా మహాదేవుని అభిషేకించే జలం అంత పవిత్రమైంది. అందుకే ఈ నీటిని విభూతి జలాలుగా పిలుస్తారు. అంతే కాదు.. ఈ నీరు శిఖరం నుంచి శివలింగంపై పడేందుకు మార్గం వుంది. ఈ మార్గాన్ని చండీ మార్గమని పిలుస్తారు. ఈ నీరు రహస్యంగా ప్రవహించటం లేదు. పక్కనే పవహించే ఆఘనాశని నది నుంచి వస్తుంది. భగీరథుడి తపస్సుకు మెచ్చి గంగ కిందకు వచ్చినప్పుడు శివుడి ఝటపై పడటం ఎలా ఉంటుందో.. భైరవేశ్వరుడిపై విభూతి జలాలు అభిషేకించటం అలానే కనిపిస్తుంది... శివరాత్రి వచ్చిందంటే చాలు... యానా గుహలకు వెళ్లి మహాదేవుని దర్శనం కోసం జనం తహతహలాడతారు. అడవిలోకి ప్రయాణించటం ఎంత కష్టమైనా.. క్రూరమైన జంతువులున్నా సరే.. యానా గుహలకు వెళ్లాల్సిందే. ఎలాంటి ఆపద ఎదురైనా సరే మృత్యుంజయుడు తమను రక్షిస్తాడన్న అపారమైన విశ్వాసం భక్తులది.. యానా గుహలు ఎలా ఏర్పడ్డాయో ఎవరికీ తెలియదు. కానీ, భారతీయ ఆధ్యాత్మిక భక్తి శిఖరాలుగా మాత్రం ఇక్కడి భైరవేశ్వర, మోహినీ శిఖరాలు అలరారుతున్నాయి. మనం దేవుణ్ణి నమ్ముతామా? లేదా అన్నది యానా గుహల విషయంలో అప్రస్తుతం. నమ్మేవాళ్లు భక్తి కోసం.. నమ్మని వాళ్లు ఒక థ్రిల్ కోసం యానా కేవ్స్ చూసి తీరాల్సిందే.. మరింకేం.. ఇది చదివిన వెంటనే నెక్స్ట్ హాలిడే ట్రిప్ కర్ణాటక వెస్టర్న్ ఘాట్స్ డిసైడ్ చేసేసుకోండి.



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 90521 16463

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.